

పెండింగ్ ప్రాజెక్టులకు.. పెద్దపీట

- కేఎల్ఐ, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్, పీఆర్ఎల్ఐ, భీమాకు బడ్జెట్‌లో కేటాయింపులు
- కొత్త ప్రాజెక్టుల్లో భూసేకరణ తర్వాతే టెండర్లు పిలవాలని ప్రభుత్వ నిర్ణయం
- ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, గృహజ్యోతి, సబ్సిడీ గ్యాస్‌కు నిధులు
- పంటల బీమాను పునరుద్ధరించనున్నట్లు ప్రకటించిన ఆర్థిక మంత్రి
- రుణమాఫీకి బడ్జెట్‌లో కేటాయింపులు



పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన అంజనగిరి రిజర్వాయర్

మహబూబ్‌నగర్, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ముందు నుంచి ఊహించినట్లుగానే ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసింది. వచ్చే సంవత్సరం డిసెంబరు చివరి నాటికి పూర్తి చేయగలిగే ప్రాజెక్టులకు ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయిస్తామని పాలమూరులో సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల నిర్వహించిన సమీక్షలో ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క గురువారం ప్రవేశపెట్టిన పద్దులో సదరు ప్రాజెక్టులకు కేటాయింపులు చేశారు. ఉమ్మడి జిల్లాలో ప్రధానంగా మహాత్మాగాంధీ కల్వకుర్తి, జవహర్ నెట్టెంపాడు, రాజీవ్ భీమా, కోయిల్ సాగర్, పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలు ఉన్నాయి. పాలమూరు-రంగారెడ్డి ఆన్‌గోయింగ్ ప్రాజెక్టు కాగా.. దాని నుంచి ఇప్పటి వరకు ఆయకట్టుకు నీరివ్వలేదు. ఈ ప్రాజెక్టు వచ్చే ఏడాది పూర్తయ్యే పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలో మొత్తం ఎత్తిపోతల పథకాల కంటే ఎక్కువే కేటాయించినప్పటికీ.. పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికే అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు బడ్జెట్ చెబుతోంది. మొత్తం రూ.2,839.88 కోట్ల మేర ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులకు కేటాయింపులు లభించాయి. పాలమూరు-రంగారెడ్డికి రూ.1,285 కోట్లు కేటాయించారు. జవహర్ నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో ప్యాకేజీలు 99, 100 కాలువల పూర్తి, గట్టు ఎత్తిపోతల పథకం, ర్యాలంపాడు లీకేజీలను అరికట్టడం కోసం రూ.104.75 కోట్లు కేటాయించారు. ఉమ్మడి జిల్లాలో పీఆర్ఎల్ఐ తర్వాత కీలకంగా ఉన్న కేఎల్ఐకి రూ.715 కోట్ల మేర నిధులు కేటాయించారు. అలాగే కోయిల్‌సాగర్ ఎత్తిపోతల పథకానికి ఊహించినట్లుగానే రూ. 411.74 కోట్ల మేర కేటాయింపులు దక్కినట్లు సమాచారం. ఇక అధికారులు పని వారీగా ప్రతిపాదనలను సిద్ధం చేసి.. పనులు వేగిరం చేసే అవకాశం ఏర్పడనుంది. ఉదాహరణకు కల్వకుర్తి ఎత్తిపోతల పథకానికి రూ.580 కోట్లు కేటాయించి కొత్త రిజర్వాయర్లు, డిస్ట్రిబ్యూటరీలు, ఫీడర్ ఛానల్ వ్యవస్థను నిర్మించడం ద్వారా.. రూ.4.20 లక్షల ఎకరాలను స్థిరీకరించవచ్చు. రాజీవ్ భీమాకు రూ.83.44 కోట్లు, సంగంబండ రిజర్వాయర్‌కు రూ.187.95 కోట్లు కేటాయించారు. ఇలాగే తక్కువ ఖర్చుతో ఎక్కువ ఆయకట్టుకు నీరిచ్చే పథకాలకే మొదటి ప్రాధాన్యమిచ్చినట్లు స్పష్టమవుతోంది.

వ్యవసాయానికి ప్రాధాన్యం..

రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయానికి అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ రంగానికి రూ.72,659 కోట్లు కేటాయించగా.. రుణమాఫీకి దాదాపు రూ.31 వేల కోట్లు వెళ్లనున్నాయి. అది కాకుండా రైతు బీమా, రైతు భరోసా పథకాలకు భారీగా నిధుల కేటాయింపు జరిగింది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో 9.15 లక్షల మంది రైతులు ఉండగా.. వారు ఈ పథకంపై ఆశలు పెట్టుకున్నారు. వారిలో చిన్న, సన్నకారు రైతులే ఎక్కువగా ఉన్నారు. అలాగే పంటల బీమా పథకాన్ని గత ప్రభుత్వం పూర్తిగా పక్కన పెట్టగా.. పంట నష్టపోయినప్పుడు సాయం అందక రైతులు ఇబ్బందులు పడ్డారు. పీఎం ఫసల్ బీమా యోజనలో గత ప్రభుత్వం చేరలేదు. అయితే ఈ ఏడాది నుంచి పీఎం ఫసల్ బీమా యోజన పథకంలో చేరతామని, రైతులు చెల్లించాల్సిన ప్రీమియాన్ని తామే చెల్లిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఉమ్మడి జిల్లాలో 18 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా.. అకాల వర్షాలు, వర్షాభావ పరిస్థితులు, వడగండ్ల వల్ల నష్టం జరిగితే బీమా వల్ల ఉపశమనం కలుగనుంది. అలాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టో సందర్భంగా వరికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించింది. తాజా బడ్జెట్‌లో ప్రభుత్వం గుర్తించిన 33 రకాల సన్న రకాలను పండించిన రైతులకు రూ.500 బోనస్ ఇవ్వనుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో గత సంవత్సరం వానాకాలంలో 7.10 లక్షల ఎకరాల్లో వరిసాగు కాగా.. 4.29 లక్షల ఎకరాల్లో సన్నాలు, 2.80 లక్షల ఎకరాల్లో దొడ్డు రకాలు సాగు చేశారు. యాసంగిలో 2.27 లక్షల ఎకరాల్లో సన్నాలు, 2.61 లక్షల ఎకరాల్లో దొడ్డు రకాలు వేశారు. ఈ ప్రోత్సాహం వల్ల సన్న రకాల సాగు పెరిగే అవకాశం ఉంది.

గ్యారెంటీ పథకాలకు నిధులు..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని ప్రకటించిన విషయం తెలిసిందే. అందులో భాగంగా ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో దాదాపు 3.70 లక్షల మంది లబ్ధిదారులు గృహజ్యోతి పథకం కింద లబ్ధి పొందుతుండగా, అందుకోసం తాజా బడ్జెట్‌లో ఈ పథకానికి ప్రభుత్వం రూ.2,418 కోట్లు కేటాయించింది. ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం కింద రూ.723 కోట్ల కేటాయించగా.. రేషన్‌కార్డు ఉన్న మహిళలకు ఇప్పటికే లబ్ధి చేకూరుతోంది. వీటితో పాటు ఉచిత బస్సు ప్రయాణానికి కూడా నిధులు కేటాయించింది. అలాగే ఎన్నికల ముందు ప్రారంభించినప్పటికీ.. ఇప్పటివరకు నిధులు కేటాయించకపోవడంతో ఇందిరమ్మ ఇళ్ల పథకానికి అడుగులు ముందుకు పడలేదు. ఈ బడ్జెట్‌లో ఈ పథకానికి రూ.9,184 కోట్లను కేటాయించింది. నియోజకవర్గానికి 3,500 ఇళ్ల చొప్పున ఈ సంవత్సరంలో మంజూరు కానున్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు 14 లక్షల మంది సొంత ఇంటి కల కోసం ఎదురుచూస్తున్నారు. పీఎం ఆవాస్ యోజన పథకం కింద వచ్చే నిధులను ఇందులో కలుపుకునే అవకాశం ఉంది. ఇవి కాకుండా గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధికి బడ్జెట్‌లో అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. దాదాపు రూ.29 వేల కోట్లు కేటాయించారు. ప్రతీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేలు సుమారు రూ.100 కోట్ల చొప్పున పంచాయతీరాజ్ రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించారు. అలాగే ఆర్అండ్‌బీకి కూడా రూ.5,790 కోట్లను కేటాయించారు. ఇక విద్యాశాఖకు రూ. 21 వేల కోట్లు కేటాయించగా.. ఈసారి నియోజకవర్గానికి ఒక సమీకృత విద్యా సంస్థల సముదాయాన్ని నిర్మించే అవకాశం ఉంది.

ఆరు గ్యారెంటీలకు హామీపత్రం రాష్ట్ర బడ్జెట్



ఆరు గ్యారెంటీలకు హామీ పత్రం ఇవాళ విడుదల చేసిన బడ్జెట్. అన్ని వర్గాల సంక్షేమానికి నిధులు కేటాయించడం గొప్ప విషయం. రైతును రాజు చేసేందుకు ఏకంగా రూ.72,659 కోట్లు కేటాయించడం గొప్ప విషయం. బడ్జెట్ గురించి మాట్లాడే నైతిక హక్కు మాజీ ముఖ్యమంత్రికి లేదు. ప్రతీ నియోజకవర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పడం జరిగింది.

- జి.మధుసూదన్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు


ప్రజలపై నీళ్లు చల్లిన బడ్జెట్



కాంగ్రెస్ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయలేదు. పింఛన్ రూ.రెండు వేల నుంచి రూ.నాలుగు వేలు పెంచుతామన్నారు. ఆ ఊసే లేదు. జిల్లాలోని ప్రాజెక్టులు, రోడ్లకు ఎంత కేటాయిస్తున్నారో స్పష్టత లేదు. కేంద్రం నిధులిస్తున్నా రాష్ట్రప్రభుత్వం ప్రజలను తప్పుదోవ పట్టించేలా వ్యవహరిస్తోంది.

- శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

పాలమూరుకు కేటాయింపులు ఎంత?



బడ్జెట్‌లో నీటి పారుదల రంగానికి రూ.22,301 వేల కోట్లు కేటాయించినా.. అందులో ప్రాజెక్టులకు ఎంత అనేది స్పష్టత లేదు. గత ప్రభుత్వం బడ్జెట్‌లో కేటాయించినట్లుగా ఖర్చు చేయలేదు. ఈ ప్రభుత్వం కూడా కేటాయింపులకే పరిమితం కాకుండా ఖర్చు చేయాలి. నిధులు కేటాయించడంతోపాటు ఖర్చు చేసినప్పుడే ఉపయోగం ఉంటుంది. జిల్లాకు సంబంధించి ఈ ప్రాజెక్టు కీలకం. విద్యకు కూడా రూ.22 వేల కోట్లు కేటాయించడం అభినందనీయం. అయితే పాలమూరు యూనివర్సిటీకి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలి.

- బాలకిషన్, సీపీఐ జిల్లా కార్యదర్శి

జడ్చర్ల చైర్‌పర్సన్‌పై నెగ్గిన అవిశ్వాసం

- విపక్షంగా మారిన స్వపక్షం సభ్యులు
- పార్టీలకతీతంగా అవిశ్వాసానికి మద్దతు పలికిన కౌన్సిలర్‌లు
- మహబూబ్‌నగర్ ఆర్డీవో సమక్షంలో ఓటింగ్



అవిశ్వాసానికి మద్దతుగా చేతులు ఎత్తిన కౌన్సిలర్లు

జడ్చర్ల, జూలై 25: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మునిసిపాలిటీ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీపై కౌన్సిలర్‌లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. స్వపక్షం సభ్యులే విపక్షంగా మారి, చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టారు. అందుకు స్వపక్షం సభ్యులైన బీఆర్ఎస్‌తో పాటు బీజేపీ, కాంగ్రెస్ పార్టీల కౌన్సిలర్‌లు సైతం ఏకపక్షంగా మద్దతు పలికారు. జడ్చర్ల మునిసిపల్ కార్యాలయంలో ప్రిసైడింగ్ అధికారి మహబూబ్‌నగర్ ఆర్డీవో నవీన్, మునిసిపల్ కమిషనర్ రాజయ్య ఆధ్వర్యంలో గురువారం ఉదయం 11 గంటలకు అవిశ్వాసం కోసం సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో చైర్‌పర్సన్ మినహా మిగిలిన 26 మంది కౌన్సిలర్‌లు పాల్గొని, అవిశ్వాసానికి మద్దతుగా ఓటు వేశారు.

అవిశ్వాసం నెగ్గింది : ఆర్డీవో నవీన్

జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మీపై పెట్టిన అవిశ్వాసం నెగ్గిందని ప్రిసైడింగ్ అధికారి, మహబూబ్‌నగర్ ఆర్డీవో నవీన్ ప్రకటించారు. అందుకు సంబంధించిన పూర్తి నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందించనున్నట్లు వెల్లడించారు. నూతన చైర్‌పర్సన్ ఎన్నిక నోటిఫికేషన్‌ను కలెక్టర్ జారీ చేస్తారని తెలిపారు.

ఏకాకిగా మారిన చైర్‌పర్సన్

జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి ఏకాకిగా మారారు. మిగిలిన కౌన్సిలర్‌లు అంతా పార్టీలకు అతీతంగా ఒక్కటయ్యారు. మునిసిపల్‌లో 27 మంది కౌన్సిలర్‌లు ఉండగా, 23 మంది బీఆర్ఎస్ పార్టీకి చెందిన వారు. తర్వాత బీజేపీ, కాంగ్రెస్‌పార్టీల నుంచి చెరో ఇద్దరు కౌన్సిలర్‌లు 2021లో జరిగిన ఎన్నికల్లో గెలిచారు. మునిసిపాలిటీ చైర్‌పర్సన్‌గా బీసీ మహిళకు రిజర్వేషన్ ఉండటంతో దోరేపల్లి లక్ష్మికి అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించారు. మెజారిటీ కౌన్సిలర్లు బీఆర్ఎస్ నుంచే ఉండటంతో చైర్‌పర్సన్‌గా దోరేపల్లి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్‌గా పాలాదిసారికలను ఎన్నుకున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కౌన్సిలర్ ఒకరు, పార్లమెంట్ ఎన్నికలలో ముగ్గురు బీఆర్ఎస్ కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరారు. దీంతో బీఆర్ఎస్ నుంచి 19 మంది, కాంగ్రెస్ పార్టీ నుంచి ఆరు మంది, బీజేపీ నుంచి ఒక్కరు కౌన్సిలర్‌లు ఉన్నారు. చైర్‌పర్సన్‌పై బీఆర్ఎస్ పార్టీకి చెందిన కౌన్సిలర్‌లే అవిశ్వాసం పెట్టాలని కోరారు. వీరికి కాంగ్రెస్, బీజేపీలకు చెందిన కౌన్సిలర్‌లు మద్దతు ఇచ్చారు.

క్యాంపు నుంచి నేరుగా..

జడ్చర్ల మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన కౌన్సిలర్‌లంతా బుధవారం మధ్యాహ్నం క్యాంపునకు వెళ్లారు. రంగారెడ్డి జిల్లా మంగల్‌పల్లి శివారులోని ఐరావ్యాలి రిసార్ట్‌కు వెళ్లిన వీరంతా గురువారం ఉదయం 11 గంటల ప్రాంతంలో మునిసిపాలిటీకి చేరుకున్నారు. తర్వాత ఓటింగ్‌లో పాల్గొన్నారు.

చైర్‌పర్సన్ భర్త నిర్వాకం వల్లే..

మునిసిపల్ చైర్‌పర్సన్ దోరేపల్లి లక్ష్మి భర్త నిర్వాకం కారణంగానే అవిశ్వాసం కోరామని కౌన్సిలర్‌లంతా వెల్లడించారు. ఆయన వల్ల తమపై అవినీతి ఆరోపణలు రావడంతో పాటు పందుల వ్యవహారంతో మాయని మచ్చ పడేలా వ్యవహరించారని చెప్పారు. తమ ప్రమేయం లేకుండా కౌన్సిల్ ఎజెండా రూపొందించిన కారణంగానే అవిశ్వాసం పెట్టాల్సి వచ్చిందంటూ కౌన్సిలర్లు పేర్కొనడం గమనార్హం.

సుద్దముక్కకూ నిధుల్లేవు

- పాఠశాలలు ప్రారంభమై 40 రోజులు పూర్తి
- నేటికీ విడుదల కాని మొదటి విడత నిధులు



బాలానగర్ మండలం మోతీన్‌పూర్ జడ్పీహెచ్ఎస్

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 25: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుద్దముక్క(చాక్ పీస్‌లు) కొనుగోలు చేయడానికి నిధులు కరువయ్యాయి. పాఠశాలల నిర్వహణ కోసం ప్రభుత్వం ఏటా నిధులు మంజూరు చేస్తుంది. 2024-2025 విద్యా సంవత్సరం ఆరంభమై నెల దాటినా ఇప్పటికీ ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు. దాంతో ఉపాధ్యాయులు బ్లాక్ బోర్డుపై రాసి, విద్యార్థులకు చూపించేందుకు సుద్ద ముక్కలను సొంత డబ్బులతో కొనుగోలు చేస్తున్నారు. స్కూల్స్‌కు విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిర్వహణ నిధులు ఏటా రెండు విడతల్లో విడుదల చేస్తారు. మొదటి విడత నిధులు జూన్ లేదా జూలైలో, రెండో విడత డిసెంబరు లేదా జనవరి ఇస్తారు. వాటిని పాఠశాలల అకౌంట్స్‌లో జమ చేస్తారు. ఈ సారి జూలై అయిపోవస్తున్నా నిధులు రాలేదు.

ఉమ్మడి జిల్లాలో 3,451 పాఠశాలలు

ఉమ్మడి పాలమూరు జిల్లాలో 3,451 ప్రభుత్వ పాఠశాలు ఉన్నాయి. అందులో సుమారు మూడు లక్షల వరకు విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. తరగతుల నిర్వహణ కోసం చాక్‌పీస్‌లు, ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిష్టర్లు తదితర సామగ్రిని స్కూల్ నిధుల నుంచి కొనుగోలు చేస్తారు. గత ఏడాది వచ్చిన నిర్వహణ నిధులు గతంలోనే అయిపోవడంతో, ఇప్పుడు స్కూల్స్ నిర్వహణ కోసం కోసం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. చిన్న చిన్న అవసరాలకు తమ సొంత డబ్బులను ఖర్చు చేస్తున్నామని పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

నిధులు విడుదల చేయాలి

స్కూల్స్‌కు నిధులు వెంటనే విడుదల చెయ్యాలి. నిధులు లేక చాక్ పీస్‌ల కొనుగోలు తదితర చిన్న చిన్న అవసరాలకూ ఇబ్బందులు పడుతున్నాం. పాఠశాలలు ప్రారంభమైన 40 రోజులు పూర్తి కావస్తున్న నిధులు ఇవ్వలేదు.

- జగదీష్‌కుమార్, టీఎస్‌జీహెచ్ఎంఏ సంఘం అధ్యక్షుడు, మహబూబ్‌నగర్ జిల్లా

విద్యార్థుల సంఖ్య ఆధారంగా పాఠశాలలకు వచ్చే నిధుల వివరాలు

విద్యార్థుల సంఖ్య	నిధులు
30	రూ.10,000
31 నుంచి 100	రూ.25,000
101 నుంచి 250	రూ.50,000
251 నుంచి 1,000	రూ.75,000
1001 నుంచి ఆపైన	రూ.లక్ష



నల్లమల అభయారణ్యంలో లభించే వివిధ రకాల ఔషధ మొక్కలు.. వాటి వేర్లు, కాయలు, పూలు..

నల్లమల ఔషధ భాండాగారం

- అభయారణ్యంలో వైద్యానికి ఉపయోగపడే 580 రకాల మొక్కలు
- ప్రభుత్వం చొరవ చూపితే ఔషధ హబ్‌గా మారే అవకాశం



ఎన్నో ఔషధ మొక్కలున్న నల్లమల అభయారణ్యం

అచ్చంపేట జూలై 25: నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమల అభయారణ్యం ఆహ్లాదాన్ని పంచడంతో పాటు ఔషధ మొక్కలకు నిలయంగా మారింది. 26,011 చదరపు కిలో మీటర్ల మేర విస్తరించిన అడవి ఎత్తైన కొండలు, జలపాతాలు, జంతువులు, పక్షులతో పాటు అరుదైన మొక్కలను తనలో దాచుకుంది. ఇక్కడి ఔషధ మొక్కలపై వందల ఏళ్ల నుంచి పరిశోధనలు జరుగుతున్నాయి. వాటితో పెద్ద పెద్ద వ్యాధులను సైతం నయం చేయొచ్చని చెబుతున్నారు ఉమ్మడి పాలమూరు జిల్లాలోని జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల వృక్షశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య. అయితే చాలా ఔషధ, ఇతర మొక్కలు అంతరించిపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రభుత్వం చొరవ చూపి, పరిశోధనలు చేయిస్తే నల్లమల ఔషధ హబ్‌గా మారే అవకాశం ఉంది.

1,480 రకాల మొక్కలు

నల్లమల అభయారణ్యంలో 1,480 రకాల మొక్కలు ఉన్నాయి. వాటిలో సూమారు 580 రకాల ఔషధ మొక్కలు ఉన్నాయి. అందులో 82 మొక్కలు కుటుంబాలకు సంబంధించినవి కాగా.. గుల్మాలు 217, వృక్షాలు 132, తీగలు 137, పొదలు జాతివి 94 రకాలు ఉన్నాయి. ఆ చెట్ల నుంచి అనేక రకాల భాగాలను సేకరించి, పలు రోగాలకు ఔషధాలుగా ఉపయోగిస్తారు. మొక్కల వేర్లు, కాండాలు, బెరడు, పత్రాలు, పుష్పాలు, కాయలు, విత్తనాలను ఎక్కువగా ఉపయోగిస్తారు.

80 రోగాలకు ఔషధం

ఇక్కడ లభించే మొక్కలను ప్రధానంగా క్యాన్సర్, గుండె జబ్బులు, కాలేయం, మూత్రం, చర్మ సంబంధ వ్యాధులతో పాటు పలు రకాల రోగాలకు ఔషధాలుగా వాడుతున్నారు.

అంతరించిపోతున్న ఔషధ మొక్కలు

వాతావరణ అసమతుల్యం కారణంగా అడవులు రోజు రోజుకు అంతరించిపోతున్నాయి. వేసవిలో అగ్ని ప్రమాదాలు సంభవించి కిలో మీటర్ల మేర చెట్లు, మొక్కలు దహనమౌతున్నాయి. దాంతో అడవితో పాటు ఔషధ మొక్కలు అంతరించిపోతున్నాయి. అతివృష్టి, అనావృష్టితో పాటు ఎన్నో మార్పుల వల్ల అడవుల్లోని వన్య ప్రాణులు మైదానాల ప్రాంతాల వైపు పరుగులు పెడుతున్నాయి.

విస్తృత పరిశోధనలు జరగాలి



నల్లమల అభయారణ్యం తెలంగాణకు భూతల స్వర్గం లాంటిది. అనేక ప్రాంతాలు ఇప్పటికీ పరిశోధనకు నోచుకోలేదు. అటువంటి ప్రదేశాలను ఎంపిక చేసుకొని, ఔషధ మొక్కలు, అంతరించిపోతున్న జీవ జాతులపైన లోతైన పరిశోధనలు జరగాల్సిన ఆవశ్యకత ఉంది. పరిశోధనలకు కావల్సిన నిధుల లేమి, అనుభవం గల పరిశోధకులు తక్కువగా ఉండటం, పులుల అభయారణ్యం కావటం వల్ల పరిశోధనలకు అనుమతులు లేక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దాంతో పరిశోధనలు అనుకున్న స్థాయిలో జరగడం లేదు. అటవీ శాఖ, విశ్వవిద్యాలయాలు, కళాశాలలు సంయుక్తంగా పరిశోధనలు చేస్తే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉంది.

- డాక్టర్ సదాశివయ్య, వృక్షశాస్త్ర అసోసియేట్ ప్రొఫెసర్, జడ్చర్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాల

లభించే ఔషధ మొక్కలు

అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ సదాశివయ్య నల్లమలలో 20 ఏళ్లుగా ఎన్నో పరిశోధనలు చేసి, పలు ఔషధ మొక్కలను కనుగొన్నారు. ఇటీవల కనుగొన్న మొక్కలలో బర్రె సుగంధిపాల, చిన్న సుగంధి పాల, నిమ్మటాయి, లాంగటాయి, నేలమేము, సఫేద్‌ముస్లి, రత్న పురుష, అడవి తమలపాకు, కొండచింత మొక్కలను కనుగొన్నారు. వాటితో పాటు దేవదారి, పొడపత్రి, మేకమేయని ఆకు, ఆకుపాల, పాలకొడిశ, ఉసిరి, తాని, కరక్కాయ, గుంపెన, మోదుగ, పునుగు, విషముష్టి, చిల్ల గింజలు ఇలా పలు ఔషధ మొక్కలపై పరిశోధనలు చేసి గుర్తించారు.

ఇంట్లో ఉండగానే దోచేస్తాడు

- నిందితుడికి సినిమా డైరెక్టర్ కావాలన్న లక్ష్యం
- చోరీ డబ్బులతో షార్ట్‌ఫిల్మ్ నిర్మాణం
- నారాయణపేట జిల్లాలో జరిగిన ఆరు చోరీ కేసుల్లో పురోగతి
- 75 తులాల బంగారం, 35 తులాల వెండి, రూ. 4 లక్షలు రికవరీ



రికవరీ చేసిన నగలు



వివరాలను వెల్లడిస్తున్న ఎస్పీ యోగేష్‌గౌతమ్

నారాయణపేట టౌన్, జూలై 25 : ఇంట్లో అందరూ నిద్రించగానే మూడో కంటికి కూడా తెలియకుండా అర్ధరాత్రి ఒంటి గంట నుంచి తెల్లవారుజామున నాలుగు గంటల వరకు చోరీలకు పాల్పడుతూ దొరికిన డబ్బుతో హైదరాబాద్, రాయిచూర్‌లలో పేకాట ఆడుతూ, జల్సాలు చేస్తున్న నిందితున్ని పట్టుకొని 75 తులాల బంగారం, 35 తులాల వెండి, రూ. 4 లక్షల నగదును రికవరీ చేసినట్లు ఎస్పీ యోగేష్‌గౌతమ్ వెల్లడించారు. గురువారం నారాయణపేట జిల్లా పోలీస్ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించి చోరీలకు సంబంధించిన వివరాలను డీఎస్పీ లింగయ్యతో కలిసి ఆయన తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన అప్పలనాయుడుకు చోరీలు చేయడం అలవాటుగా మారిందని, మక్తల్‌కు చెందిన చిగుళ్ల పల్లి రాఘవేందర్ ఇంట్లో 41.5 తులాల బంగారం, మరికల్‌కు చెందిన గౌడపల్లి రాములు ఇంటిలో 20 తులాల బంగారు ఆభరణాలు, 35 తులాల వెండి ఆభరణాలు, నాలుగు లక్షల నగదు, నారాయణపేటలోని అశోక్‌నగర్‌కు చెందిన అభ్రేష్‌కుమార్ ఇంట్లో 2.5 తులాల బంగారంతో పాటు తాజాగా జరిగిన ఆరు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. నిందితుడు గతంలో సైబరాబాద్, రాచకొండ, హైదరాబాద్ పరిధిలో కూడా చోరీలు చేసినట్లు నేర చరిత్ర ఉన్నదన్నారు. ఇప్పటివరకు సుమారు 90 చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు తెలిపారు. చోరీ డబ్బుతో గతంలో ఓ షార్ట్ ఫిల్మ్ కూడా తీశాడని, సినిమా డైరెక్టర్ కావాలన్న ఆశ ఉన్నట్లు ఎస్పీ తెలిపారు. కేసును ఛేదించడంలో కృషి చేసిన మరికల్, మక్తల్ సీఐలు రాజేందర్‌రెడ్డి, చంద్రశేఖర్, ఎస్ఐలు భాగ్యలక్ష్మీరెడ్డి, మురళి, వెంకటేశ్వర్లు, పోలీస్ సిబ్బంది పల్లె తిరుపతిరెడ్డి, నరేష్, శ్రీకాంత్‌లను ఎస్పీ అభినందించి రివార్డులు అందించారు.

వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలు

అయిజ, జూలై 25: వీధి కుక్కల దాడిలో చిన్నారికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన గద్వాల జిల్లా అయిజ పట్టణంలోని గురువారం చోటు చేసుకున్నది. అయిజ పట్టణంలో కర్నూల్ చౌరస్తాలోని భీమ్‌రెడ్డి, మాధవి దంపతుల కుమా రుడు నిహాన్‌రెడ్డి తన తండ్రి దుకాణం ముందు ఆడుకుంటుండగా కుక్కలు దాడి చేశాయి. అదే సమయంలో అక్కడే ఉన్న భీమ్‌రెడ్డి కుక్కలను తరిమివేశారు. చిన్నారిని చికిత్స నిమిత్తం కర్నూలు ఆస్పత్రికి తరలించారు.

నెలలు నిండని పిల్లలకు అధునాతన వైద్యం

- సుశ్రుత రేయిన్‌బో నియోనెటల్ కేర్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ ప్రియాంక

మహబూబ్‌నగర్(వైద్యవిభాగం) జూలై 25: నెలలు నిండకుండా తక్కువ బరువుతో పుట్టిన శిశువులకు అధునాత వైద్యసేవలు అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు సుశ్రుత ప్రజా వైద్యశాలలోని రేయిన్‌బో నియోనెటల్ కేర్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ ప్రియాంక తెలిపారు. గురువారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నవాబ్‌పేట మండలం మరికల్ గ్రామానికి చెందిన సుమతి, బాలరాజు దంపతులకు మే13న కవల పిల్లలు పుట్టారన్నారు. అయితే పుట్టిన వారిలో పాప 825 గ్రాములు, బాబు 1.2 కేజీల బరువు ఉండటంతో తమ కేంద్రానికి తీసుకవచ్చారన్నారు. ఏడు నెలలకే డెలివరీ కావడంతో శిశువులకు అవయవాలు ఏర్పడకుండా ఉన్నారని, కనీసం శ్వాస తీసుకేందుకు కూడా కష్టంగా ఉండిందన్నారు. ఆ క్రమంలో ఆ పిల్లలను నియోనెటల్ కేంద్రంలో జాయిన్ చేసి వెంటిలేటర్ సహాయంతో అత్యాధునిక చికిత్స అందించామన్నారు. ప్రస్తుతం ఒకరి బరువు 825 గాముల నుంచి 1.8 కేజీలు, మరొకరి బరువు 1.2 కేజీల నుంచి 2.4 కేజీలకు పెంచి ఆరోగ్యవంతులుగా చేశామని తెలిపారు. మొత్తం 120 రోజులు ప్రత్యేక పర్యవేక్షణలో చికిత్స అందించి డిశ్చార్జి చేస్తున్నా మన్నారు. అయితే ఇదే చికిత్స కార్పొరేట్‌లో ఒక్కొక్కరికి రూ. ఐదు లక్షల నుంచి రూ. ఆరులక్షల వరకు ఖర్చు అవుతుందని, కానీ, తమ కేంద్రంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగానే వైద్యసేవలు అందించామని తెలిపారు. సమావేశంలో డాక్టర్ నిఖిల్ కుమార్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.


కవలలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న డాక్టర్ ప్రియాంక

సీఎం పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలి


అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

కల్వకుర్తి/వెల్దండ, జూలై 25 : ఈనెల 28న కల్వకుర్తి పట్టణానికి రానున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేప ట్టాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బదావత్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కల్వకుర్తి పరిధిలోని కొట్ర గేటు వద్ద ఏర్పాటు చేసిన కేంద్ర మాజీ మంత్రి దివంగత సూదిని జైపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ ఏర్పాట్లను గురువారం కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. జైపాల్‌రెడ్డి విగ్రహ ఏర్పాటు పరిసరాలను పూల మొక్కలతో సుందరంగా తీర్చిదిద్దాలని, పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం కల్వకుర్తి పట్టణం లోని మునిసిపల్ కార్యాలయం వద్ద నిర్వహించనున్న బహిరంగ ప్రదేశాన్ని కలెక్టర్ పరిశీలించారు. వీఐపీ గ్యాలరీ, ముఖ్యమంత్రి సభ స్థలం, ప్రజలకు కావాల్సిన ఏర్పాట్లు తదితర అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. ముఖ్యమంత్రి సభ వేదికను రానున్న మూడు రోజుల పాటు వాతావరణాన్ని దృష్టిలో ఉంచుకుని అందుకు అనుకూలమైన సభా స్థలాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ వెంట కల్వకుర్తి ఆర్డీవో ఎస్.శ్రీను, మునిసిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్, వెల్దండ తహసీల్దార్ రవికుమార్, కల్వకుర్తి తహసీల్దార్ ఇబ్రహీం, కల్వకుర్తి సీఐ నాగార్జున, అధికారులు పాల్గొన్నారు.

ఐకానిక్ వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలి

కొల్లాపూర్, జూలై 25 : సోమశిల కృష్ణానదిపై తెలుగు రాష్ట్రాలను అనుసంధానం చేసే ఐకానిక్ వంతెన నిర్మాణానికి నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు కోరారు. గురువా రం ఢిల్లీలో కేంద్ర జలవనరుల, రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్క రీకి ఎల్లేని వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నుంచి కర్నూల వరకు 167కే జాతీయ రహదారిని మంజూరు చేసి పనులు ప్రారంభించినం దుకు కొల్లాపూర్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపినట్లు ఎల్లేని వెల్లడించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తల్లోజు ఆచారి, శ్రీవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆరు లేన్ల రహదారిని నిర్మించాలి

కల్వకుర్తి : తుక్కుగూడ నుంచి శ్రీశైలం వరకు ఆరులేన్ల జాతీయ రహదారిని మంజూరు చేసి నిర్మించేలా చూడాలని జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి కోరారు. గురువారం న్యూఢిల్లీలోని కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్‌గడ్కరీని కలిసి వినతి పత్రం అందజేశారు. కల్వకుర్తి నుంచి శ్రీశైలం రహదారిని నాలుగు లైన్లు రహదారి మంజూరు చేయాలని కోరినట్లు తల్లోజు తెలిపారు. ఇందుకు కేం ద్రమంత్రి నితిన్‌గడ్కరీ కూడా సానుకూలంగా స్పందించారని ఆచారి తెలిపారు.

ఎంపీలను అడ్డుకుంటాం

- పాలమూరు యువగళం వ్యవస్థాపక అధ్యక్షుడు టీకే శివ ప్రసాద్

పాలమూరు యూనివర్సిటీ, జూలై 25: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తీసుకోనే బీజేపీ ఎంపీలు రావాలని, లేకపోతే అడ్డుకుంటామని పాలమూరు యువగళం వ్యవస్థాపక అధ్యక్షుడు టీకే శివ ప్రసాద్ అన్నారు. గురువారం పాలమూరు యూనివర్సిటీలో పీయూ విద్యార్థి నాయకులు, పాలమూరు యువగళం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీల పని తీరుకు నిరసనగా పాలమూరు యువగళం ఆధ్వర్యంలో ఈ నెల 29న బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడికి పిలుపునిచ్చారు. సమావేశంలో పాలమూరు నిరుద్యోగ ఫోరం అధ్యక్షుడు చుక్క రవి, పీయూ జేఏసీ అధ్యక్షుడు బత్తిని రాము, పీయూ బీఆర్ఎస్వీ అధ్యక్షుడు భారత్, పీయూ విద్యార్థులు, పాలమూరు యువగళం నాయకులు మహేష్, బాలు, రవినాయక్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రాలీపై నుంచి జారి కింద పడి వ్యక్తి మృతి

మాగనూరు, జూలై 25: ట్రాక్టర్ ట్రాలీపై నుంచి కిందపడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన నారాయణపేట జిల్లా మాగనూరు మండలం అడవి సత్యారం గ్రామంలో గురువారం చోటు చేసుకున్నది. ఎస్ఐ అబ్దుల్ ఖాదర్ తెలిపిన వివరాల ప్రకారం... గద్వాల జిల్లా కేటిదొడ్డి మండలానికి చెందిన దొబ్బ ఈరప్ప(55), గ్రామానికి చెందిన రైతు అంజప్ప వద్ద కూలీ పనులకు వచ్చాడు. ట్రాక్టర్ ట్రాలీపై వరినారు పట్టుకొని కూర్చుడంగా డ్రైవర్ అజాగ్రత్తగా నడపడం వల్ల ట్రాక్టర్‌పై నుంచి కిందపడి తలకు బలమైన గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా మృతి చెందాడు. మృతుడి కుమారుడు నాగరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఇద్దరికి జైలు, జరిమానా

కల్వకుర్తిటౌన్, జూలై25 : మద్యం తాగి వాహనాలు నడిపిన ఇద్దరికి న్యాయాధికారి రెండు రోజుల పాటు జైలు, జరిమానా విధించినట్లు ఎస్ఐ మాధవరెడ్డి తెలిపారు. గురువారం ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. వాహనాల తనిఖీల్లో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి వాహనాలు నడుపుతుండగా పట్టుకున్నట్లు తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టగా న్యాయాధికారి జైలు, జరిమానా విధించారన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

మనిషి జన్మకు పరమార్థం ఏమిటన్నది చిరకాల ప్రశ్న. సమాధానాలు అనేకం ఉన్నా, 'ముక్తి సాధన' అనేది ఏ ఒక్కరూ కాదనలేనిది. దీనికి మరో పేరు 'మోక్ష ప్రాప్తి'. జనన, మరణ బంధం నుంచి విమోచన పొందడం అన్నమాట. అంటే, ఆ చక్రం నుంచే బయటపడటం. ఇది మాటలు, రాతలు కాదు... చేతలతోనే సాధ్యమవుతుంది. దీనికి ఏకైక మార్గం... ప్రతీ వ్యక్తి ఆత్మజ్ఞానం కలిగి ఉండడమే. ఎవరి గురించి వారు తెలుసుకోవాలంటే దైవశక్తినే సాధనంగా భావించాలి. తెలుసుకునే క్రమంలో మన ముందు నాలుగు మార్గాలు కనిపిస్తాయి.. అవన్నీ 'గ'కారంతో మొదలయ్యేవే. అంటే... 'గ'కార చతుష్టయం. అవి: గీత, గంగానది, గాయత్రీ మంత్రం, గోవింద నామం. నిత్యజీవితంలో వీటి స్మరణ మానవ జీవితానికి సార్థకత కలిగిస్తుందని భారతీయ సంస్కృతిని చాటి చెబుతోంది. అదే విషయాన్ని 'ఆత్మ నివేదనం' పేరిట విపులీకరిస్తోంది. 'నివేదన' అంటే 'సమర్పణ' అని అర్థం. మనసును, వాక్కును, కర్మను కేంద్రీకరించడం. ఈ కేంద్రీకరణ ద్వారానే స్వీయ పరిశీలన వేగవంతమవుతుంది.



ముక్తి సాధన కోసం... గకార చతుష్టయం

చతుర్వేదాల సారాంశం

'గ'కార చతుష్టయంలో మొదటిది భగవద్గీత. ఇందులో ఉన్నదంతా వేద విజ్ఞాన సారం. వేదాలు నాలుగు. ఋగ్వేదం, యజుర్వేదం, సామవేదం, అథర్వ వేదం. 'వేదం' అనేది 'విద్' (తెలియడం) నుంచి ఏర్పడింది.


ఋగ్వేదం అంటే దేవ వేదమే. ఇందులోని కొన్ని సూక్తాలు పురాణాలను, సామాజిక వర్తనను వివరిస్తాయి. యజుర్వేదం యజ్ఞ నిర్వహణ రీతిని తెలుపుతుంది. మధురతకు సూచిక సామ వేదం. అంతేకాక, సకల జ్ఞాన ప్రదాయని. అథర్వ(ణ) వేదం ఆ ఋషి పేరు మీదుగా వచ్చింది. ఇందులోనూ శాస్త్రీయ పరిజ్ఞాన వైభవం కనిపిస్తుంటుంది. చతుర్వేదాల సారాంశ సమాహారం కాబట్టే.. భగవద్గీతకు అంతటి ప్రసిద్ధి, విశిష్టత కలిగాయి.

వేదమాత

గాయత్రీదేవి వేదమాతగా ప్రశస్తి అందుకుంది. 'గయలు' అంటే ప్రాణాలు. 'త్రాయతే' అనే పదానికి పరిరక్షణ అని అర్థం. అందుకే ప్రాణ సంరక్షకురాలుగా గాయత్రిని ఆరాధి



స్తారు. గాయత్రీ మంత్రంలోని "ఓం భూర్భువ స్సువః తత్సవితుర్వరేణ్యమ్'ను పరిశీలిస్తే... 'ఓం (సర్వ రక్షణ), భూ (ఉనికి), భువ (జ్ఞాన రూపం), స్వ (ఆనంద స్వరూపం), తత్ (అటువంటి లక్షణ సమన్విత పరమేశుడు), సవితు (విశ్వ కర్త) వరేణ్యం (సర్వులతో ఆరాధనీయులు)' అనే భావార్థాలు ఇమిడి ఉన్నాయి. ఇవన్నీ సంప్రదాయ పరంగా, శాస్త్రీయంగా కూడా ప్రామాణికాలు.



అనంత ఫలప్రదం

ఇక గోవింద నామం... 'గ'కార చతుష్టయంలో దీని పాత్ర అనంతం. 'శ్రీనివాసా, శ్రీవేంకటేశా, నిత్య నిర్మలా, భక్త వత్సలా, దినకర తేజా' అని స్మరణలు చేస్తారు ఆరాధకులు. 'గోవింద' అంటే భూ పరిరక్షకుడు. వేదాల వల్ల ఘనతరుడనే అంతరార్థమూ ఉంది. గోవింద నామం అనంత ఫలప్రదం.

యోగవిద్యకు సంబంధించి సాధన చతుష్టయమనే మాట వినిపిస్తూ ఉంటుంది. వివేకంతో వ్యవహరించడం, యధాతథ స్థితిని గ్రహించగలగడం, సంపత్ లేదా సమతుల్యతను కోరుకోవడం, ఆత్మ జ్ఞాన ప్రాప్తికి పలు విధాలుగా ప్రయత్నించడం. ఇదంతా అభ్యాస సాధనాల క్రమం. వీటన్నిటి ఫలితంగా స్వయం పరిశీలన శక్తి విస్తారమవుతుంది. క్రమేణా ముక్తి ప్రాప్తికి మార్గం సులభతరంగా మారుతుంది.

మానసిక, నైతిక పరమోన్నత స్థితి ముక్తి. అంటే... వ్యక్తి తన సహజత్వాన్ని పొందగలగడం. దీనికి మూలాధారం ఆత్మ నివేదన. దైవం పట్ల పరిపూర్ణ ప్రేమను వ్యక్తపరచే రీతి. భక్తి మార్గాలు ఎన్నో ఉంటాయి. వాటన్నిటికన్నా నివేదన విధానమే భగవంతుడిని, భక్తుడిని అనుసంధానిస్తుంది. పత్రం, పుష్పం, ఫలం, చివరికి నీటినైనా భక్తితో సమర్పిస్తే ప్రీతిగా స్వీకరిస్తానన్నది గీతాచార్యుడి మాట. నిజానికి మనిషి శరీరం ఆకు వంటిదే. రాలిపోతుందే తప్ప, శాశ్వతం కాదు. అందువల్ల పత్ర అర్చనకు ఆ వ్యక్తి సంసిద్ధం కావాలి. తన మనోవనంలోని మొగ్గను పుష్పంలా వికసింప చేయాలి. ఆ వికసిత పుష్పమే విజ్ఞాన ఫలంగా రూపాంతరం చెందడాన్ని సమర్పణగా వర్ణిస్తుంది మన భారతీయ ధార్మిక చింతన. పవిత్ర గీత, పావన గంగ, శక్తిదాయక గాయత్రి, స్ఫూర్తిప్రదాయ గోవింద స్మరణలకు మనను మనం సమర్పించుకుంటేనే జీవితాలకు ధన్యత. వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, భక్తి జ్ఞాన కర్మ యోగాదులు చాటి చెబుతున్నది ఇటువంటి ఆత్మ సమర్పణ పద్ధతినే.

• జంధ్యాల శరత్‌బాబు
99483 45013

భువనపావని...

యమున, కృష్ణా, గోదావరి, కావేరి, సింధు, నర్మదలతో పాటు సప్త నదుల్లో ఒకటి గంగ. 'భువన పావని', 'అనంత వాహిని' అనేవి దాని నామాంతరాలు. మన సంస్కృతి, చరిత్ర, వ్యవస్థ అంతా గంగానదితో మమేకమై ఉంది. గంగమ్మ తల్లిగా, గంగా భవానీగా పిలిచేది అందుకే. గంగను నీటికి పర్యాయపదంగా మనం ఉపయోగిస్తాం.. గంగ మరెన్నో నదులతో కలసి మహా ప్రవాహంగా మారుతుంది. ఆ జల స్నానం భారతీయులకు పరమ పవిత్రం. గంగా, యమున, సరస్వతీ నదుల సంగమ స్థలాన (త్రివేణి) కుంభ మేళాలు ఏర్పాటవుతుంటాయి. అలహాబాద్ (ప్రయాగ)లో ఈ మహోత్సవం వచ్చే ఏడాది జనవరిలో మొదలవుతుంది. ఇంతటి మేటి విశిష్టత కారణంగా... గంగ విశ్వ విఖ్యాతి పొందింది.

సుభాషితం

సజ్జన లక్షణాలు

ప్రదానం ప్రచ్ఛన్నం గృహ ముపగతే సంభ్రమవిధిః
ప్రియంకృత్వా మౌనం సదసి కథనం చాప్యుపకృతేః
అనుత్సేకో లక్ష్మ్యాం నిరభిభవసారాః పరకథాః
సతాం కేనోద్దిష్టం విషమ మసిధారావ్రత మిదమ్



సజ్జనుల్లో సహజంగా ఉండే లక్షణాల గురించి 'నీతి శతకం'లో భర్తృహరి వివరించిన శ్లోకం ఇది. దీన్ని...

పొసగన్ దానము గుప్త మర్థి భవనంబు జేరుచో సంభ్రమో
ల్లసదుత్థానవిధానముం బ్రియవిధుల్ గావించి మౌనంబు రా
జసభన్ మిత్రకృత ప్రకాశనము గుత్సాకర్మ వైముఖ్య మీ
యసిధారావ్రతచర్య యెవ్వడు మహర్యశ్రేణికిం దెల్పెనో.. అంటూ ఏనుగు లక్ష్మణకవి సముచిత రీతిలో తెలుగువారికి సమర్పించాడు.

భావం: దానాలు చేస్తున్నానని చాటింపు వేసుకోకుండా రహస్యంగా చేయడం. ఇంటికి వచ్చి యాచించిన వారిని ఆదరించడం. వేరొకరికి తను చేసిన మేలు గురించి ప్రచారం చేసుకోకపోవడం, వేరొకరు తనకు చేసిన మేలును పదిమందికీ చెప్పడం, ఎన్ని సంపదలు వచ్చినా వినయంగా ఉండడం, పరుల గురించి చెడ్డగా మాట్లాడకపోవడం... వీటన్నిటినీ పాటించడం కత్తి మీద సాములాంటిది. ఈ గుణాలు ఎవరో బోధిస్తేనో, నేర్పితేనో రావు. సజ్జనుల్లో ఈ లక్షణాలు స్వతస్సిద్ధంగా ఉంటాయి.

సద్బోధ

యోగి- సాధువు

పూర్వం ఒక యోగి అకుంఠితమైన తపస్సు చేసి, కొన్ని గొప్ప శక్తులను సంపాదించాడు. అతను స్వతహాగా మంచివాడు. కానీ తన శక్తులంటే అతనికి గర్వం ఉండేది. వాటిని ప్రదర్శించాలనే కోరిక ఉండేది. ఆ గర్వాన్ని తగ్గించాలని దేవుడు అనుకున్నాడు. ఒక రోజు... సాధువు రూపంలో ఆ యోగి దగ్గరకు వచ్చాడు. "స్వామీ! మీకు అద్భుతమైన శక్తులు ఉన్నాయని విన్నాను. మిమ్మల్ని దర్శించుకోవాలని వచ్చాను" అని అన్నాడు. మాటలు విన్న యోగి ఉప్పొంగిపోయాడు. మునిని సాదరంగా ఆహ్వానించి, ఆతిథ్యం ఇచ్చాడు.

ఈలోగా అటువైపు ఒక ఏనుగు వెళుతోంది. సాధువు దాన్ని చూపిస్తూ "స్వామీ! మీరు కోరుకుంటే ఆ ఏనుగును చంపగలరా?" అని అడిగాడు.

"ఎందుకు చంపలేను? ఇదిగో చూడండి" అంటూ నేల మీద పిడికెడు మట్టి తీసుకున్నాడు యోగి. దాన్ని మంత్రించి ఏనుగు మీదకు విసిరాడు. ఆ ఏనుగు నొప్పితో విలవిలలాడుతూ నేల మీద పడి మరణించింది.

'చూశావా!' అన్నట్టు గర్వంగా తలాడించాడు యోగి.


"మీ శక్తులు అమోఘం స్వామీ! మీరు ఏనుగును చంపేశారు. మరి దాన్ని మళ్ళీ బతికించగలరా?" అని అడిగాడు సాధువు.

"తప్పకుండా" అంటూ మరికాస్త మట్టి తీసుకొని, మంత్రించి, మరణించిన ఏనుగు మీద చల్లాడు యోగి. ఆ ఏనుగు లేచి నిలబడింది. శరీరానికి అంటుకున్న దుమ్మును విదిలించుకుంటూ అడవిలోకి నడిచింది.

"స్వామీ! మీకు అపారమైన శక్తులు ఉన్నాయి. కానీ నాకొక సందేహం ఉంది తీరుస్తారా?" అన్నాడు సాధువు.

"దానికేం? అడగండి" అన్నాడు యోగి.

"మీరు ఏనుగును చంపారు. దాన్ని మళ్ళీ బతికించారు. కానీ అందువల్ల మీకు కలిగిన ప్రయోజనం ఏమిటి? ఆధ్యాత్మికమైన ఉన్నతి కలిగిందా? మోక్షాన్ని, భగవంతుణ్ణి చేరే మార్గం దొరికిందా?" అని ప్రశ్నించాడు సాధువు.



ఆ మాటలకు యోగి దిగ్భ్రాంతి చెందాడు. సాధువు రూపంలో ఉన్న దేవుడు చిరునవ్వు నవ్వుతూ మాయమైపోయాడు. ఇంతసేపూ తన ముందు ఉన్నది సాక్షాత్తూ భగవంతుడేనని యోగికి అర్థమయింది. ఆ క్షణం నుంచి అతనిలో గర్వం, కోరికలు పూర్తిగా నశించిపోయాయి.

శ్రీ రామకృష్ణ పరమహంస తన శిష్యులకు ఈ కథ చెబుతూ "సూది బెజ్జానికి అడ్డుగా కంటికి కనిపించని చిన్న నలుసు ఉన్నా సరే.. దానిలోంచి దారం వెళ్ళడం కష్టమవుతుంది. అదే విధంగా సాధకుల్లో ఇసుకరేణువంత కోరిక, గర్వం మిగిలి ఉన్నా.. పరమాత్మ తత్త్వాన్ని గ్రహించలేరు. మోక్షపథాన్ని అందుకోలేరు" అని స్పష్టం చేశారు.

'దిక్సూచి' వెబ్ పేజీలో...
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/MNuqlklలో చదవండి.

బిజినెస్

టెక్ మహీంద్రా లాభంలో 23% వృద్ధి

క్యూ1లో రూ.851 కోట్లుగా నమోదు.. రూ.13,005 కోట్లకు తగ్గిన ఆదాయం



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2024-25)లో జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి (క్యూ) టెక్ మహీంద్రా రూ.851 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో ఇదే కాలానికి గడించిన రూ.692.5 కోట్ల లాభంతో పోలిస్తే, ఈసారి 23 శాతం వృద్ధి నమోదైంది. కాగా, ఈ క్యూ1లో కంపెనీ ఆదాయం వార్షిక ప్రాతిపదికన 1.2 శాతం తగ్గి రూ.13,005 కోట్లకు పరిమితమైంది. ఆదాయం తగ్గినప్పటికీ, మొత్తం వ్యయాలు 2.3 శాతం తగ్గి రూ.955 కోట్లకు పరిమితం కావడం, వడ్డీ ఖర్చులు 40 శాతం తగ్గి రూ.715 కోట్లకు దిగిరావడం లాభాల్లో మెరుగైన వృద్ధికి దోహదపడింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2024-25 ఆర్థిక సంవత్సరంలో కంపెనీ మరింత మెరుగైన పనితీరు కనబర్చనుందని టెక్ మహీంద్రా కొత్త ఎండీ, సీఈఓ మోహిత్ జోషి అన్నారు.

- సేవల వ్యయం తగ్గడంతో క్యూ1లో కంపెనీ నిర్వహణ లాభాల మార్జిన్ మరో 1.9 శాతం పెరిగి 12 శాతంగా నమోదైంది. ఇకపై లాభాల మార్జిన్ క్రమంగా పుంజుకోనుందని మోహిత్ జోషి అన్నారు.
- గడిచిన మూడు నెలల్లో కంపెనీ 53.4 కోట్ల డాలర్ల విలువైన కొత్త డీల్స్‌ను కుదుర్చుకుంది. అయితే, ఐటీ రంగం ఇంకా అనిశ్చితిలోనే కొనసాగుతోందని, ఈ మధ్యనే చేపట్టిన పునర్వ్యవస్థీకరణ ప్రణాళిక కంపెనీకి దోహదపడుతోందని జోషి పేర్కొన్నారు.

6,000 మంది ఫ్రెషర్ల నియామకాలు

గత మూడు నెలల్లో టెక్ మహీంద్రా ఉద్యోగులు నికరంగా 2,165 మంది పెరిగారు. దాదాపు 1,000 మంది ఫ్రెషర్ల నియామకాలతో పాటు బీపీఓ విభాగంలో మరింత మందిని చేరుకున్నట్లు కంపెనీ వర్గాలు తెలిపాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రాంగణ నియామకాల ద్వారా 6,000 మంది ఫ్రెషర్లను చేర్చుకోవాలనుకుంటున్నట్లు కంపెనీ ఇదివరకే ప్రకటించింది.

ద్వితీయార్ధంలో సిబ్బందికి వేతన పెంపు

తమ కంపెనీలో పనిచేస్తున్న 1.47 లక్షలకు పైగా ఉద్యోగులకు వేతనాన్ని పెంచాలనుకుంటున్నట్లు జోషీ వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరం ద్వితీయార్ధంలో (2024 అక్టోబరు-2025 మార్చి) పెంపు ఉంటుందని, ఇదే విషయాన్ని సిబ్బందికి తెలియజేయడం జరిగిందన్నారు. ఐటీ రంగ కంపెనీలకు ఉద్యోగుల జీతాలే ప్రధాన వ్యయం.

పసిడి పడుతోంది..

న్యూఢిల్లీ: పసిడి, వెండి ధరలు వరుసగా మూడో రోజూ తగ్గుముఖం పట్టాయి.ఢిల్లీ మార్కెట్లో 10 గ్రాముల మేలిమి (24 క్యారెట్లు) బంగారం ధర గురువారం మరో రూ.1,000 తగ్గి రూ.70,650 స్థాయికి జారుకుంది. కిలో వెండి ఏకంగా రూ.3,500 తగ్గడంతో ధర రూ.84,000కు దిగివచ్చింది. అంతర్జాతీయంగా వీటి ధరలు గణనీయంగా తగ్గడంతో పాటు దేశీయ బులియన్ మార్కెట్లోనూ జువెలర్లు భారీగా అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. గడిచిన మూడు రోజుల్లో తులం బంగారం రూ.5,000 తగ్గింది. ఈ విలువైన లోహాలపై కస్టమ్స్ సుంకాన్ని 6 శాతానికి తగ్గిస్తున్నట్లు బడ్జెట్‌లో ప్రకటించడంతో ఈనెల 23న గోల్డ్ రేటు ఏకంగా రూ.3,350 పడిపోయి రూ.72,300 స్థాయికి జారుకుంది. ఈ ఏడాదిలో అదే అతిపెద్ద తగ్గుదల. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ధర ఒక దశలో 42.20 డాలర్లు తగ్గి 2,421 డాలర్ల స్థాయిలో ట్రేడవగా.. సిల్వర్ 28 డాలర్ల స్థాయికి పడిపోయింది.

మెటల్, బ్యాంకింగ్ షేర్లు పడేశాయ్..

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు వరుసగా ఐదో రోజూ నష్టాలు చవిచూశాయి. గురువారం ట్రేడింగ్ ఆరంభంలోనే 671 పాయింట్ల వరకు క్షీణించి 79,500 దిగువ స్థాయికి జారుకున్న సెన్సెక్స్.. మళ్లీ క్రమంగా తేరుకుని చివరికి 109.08 పాయింట్ల నష్టంతో 80,039.80 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 203 పాయింట్ల మేర పతనమై 24,200 స్థాయికి జారుకుంది. చివర్లో 7.40 పాయింట్ల నష్టంతో 24,406.10 వద్ద ముగిసింది. అంతర్జాతీయ మార్కెట్ ట్రెండ్ బలహీనంగా ఉండటంతో ఇన్వెస్టర్లు లోహం, బ్యాంకింగ్, ఆర్థిక సేవల రంగాల షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. మూలధన లాభాలపై పన్ను పెంచడంతో విదేశీ ఇన్వెస్టర్లు మన ఈక్విటీల నుంచి పెట్టుబడులు ఉపసంహరించుకోవడం కూడా మార్కెట్‌పై ఒత్తిడి పెంచింది.

30 నుంచి అకుమ్స్ డ్రగ్స్ ఐపీఓ: అకుమ్స్ డ్రగ్స్ అండ్ ఫార్మాస్యూటికల్స్ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) ఈ నెల 30న ప్రారంభమై ఆగస్టు 1న ముగియనుంది. ఐపీఓలో విక్రయించనున్న షేర్ల బిడ్డింగ్ ధర శ్రేణిని కంపెనీ రూ.646-679గా నిర్ణయించింది. తద్వారా రూ.1,857 కోట్ల వరకు సమీకరించాలనుకుంటోంది.

ఐపీఓకి స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూకి వస్తోంది. ఈ మేరకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.600 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో రూ.250 కోట్ల మొత్తానికి కొత్తగా రూ.10 ముఖ విలువతో కూడిన ఈక్విటీ షేర్లు జారీ చేయటం ద్వారా సమీకరించనుంది. మిగిలిన రూ.350 కోట్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) ద్వారా సమీకరించనుంది. ఓఎఫ్ఎస్ ద్వారా 1.844 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. ఫార్మాస్యూటికల్, కెమికల్ రంగాలకు అవసరమైన స్పెషలైజ్డ్ ఇంజనీరింగ్ పరికరాల తయారీలో కంపెనీ కీలకంగా ఉంది.

సైయెంట్ లాభంలో 17శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్‌తో ముగిసిన తొలి త్రైమాసికంలో సైయెంట్ రూ.1,414 కోట్ల రెవెన్యూపై రూ.141 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చితే ఆదాయం 2.8 శాతం, లాభం 17 శాతం క్షీణించాయి. కరెన్సీ మారకం ప్రభావం జూన్ త్రైమాసిక ఫలితాలపై పడిందని, దీంతో డిజిటల్, ఇంజనీరింగ్, టెక్నాలజీ (డీఈటీ) వ్యాపారం క్షీణించిందని కంపెనీ పేర్కొంది. జూన్ త్రైమాసికంలో 5.24 కోట్ల డాలర్ల విలువైన ఆర్డర్లను కంపెనీ చేజిక్కించుకుంది. ఈ ఆర్డర్ల కారణంగా రానున్న త్రైమాసికాల్లో నిలకడైన వృద్ధిని కనబరచవచ్చని భావిస్తున్నట్లు సైయెంట్ తెలిపింది. సమీక్షా త్రైమాసికంలో సెమీకండక్టర్ విభాగంలోకి కంపెనీ అడుగుపెట్టిందని, ఇందుకోసం ప్రత్యేకంగా అనుబంధ సంస్థను ఏర్పాటు చేసినట్లు తెలిపింది.

48 శాతం తగ్గిన లారస్ ల్యాబ్స్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికానికి గాను లారస్ ల్యాబ్స్ లిమిటెడ్ రూ.1,195 కోట్ల రెవెన్యూపై రూ.13 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంతో పోల్చితే ఆదాయం 1 శాతం, లాభం 48 శాతం తగ్గింది. సమీక్షా త్రైమాసికంలో కీలకమైన సీడీఎంఓ క్లినికల్ ప్రాజెక్టుల్లో నిలకడైన పనితీరుతో పాటు అంకాలజీ ఏపీఐ, ఏఆర్‌వీ విభాగంలో పటిష్ఠమైన వృద్ధిని కనబరచటం కలిసివచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు. ఈ కాలంలో కంపెనీ సీడీఎంఓ-సింథసిస్ వ్యాపారం రూ.214 కోట్లుగా ఉండగా ఏపీఐ రెవెన్యూ రూ.664 కోట్లుగా ఉంది.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	69,820 ▼	64,000 ▼	89,000 ▼
ముంబై	68,227 ▼	62,496 ▼	81,474 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

26వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	480
వరంగల్	462	గోదావరి	475
చిత్తూరు	573	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	72

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	104	విజయవాడ	104
వరంగల్	104	గుంటూరు	107
కరీంనగర్	104	ఒంగోలు	107
మహబూబ్‌నగర్	104	చిత్తూరు	120
కర్నూలు	104	నెల్లూరు	120
విశాఖపట్నం	93	అనంతపురం	104
గోదావరి	104		

మ్యాన్‌కైండ్ గూటికి బీఎస్‌వీ

- ఒప్పందం విలువ రూ.13,630 కోట్లు
- అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి కొనుగోలు



న్యూఢిల్లీ: భారత్ సీరమ్స్ అండ్ వ్యాక్సిన్స్ (బీఎస్‌వీ)లో 100 శాతం వాటాను రూ.13,630 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు మ్యాన్‌కైండ్ ఫార్మా గురువారం ప్రకటించింది. అంతర్జాతీయ ప్రైవేట్ ఈక్విటీ సంస్థ అడ్వెంట్ ఇంటర్నేషనల్ నుంచి ఈ కంపెనీని చేజిక్కించుకుంది. బీఎస్‌వీ కోసం ఈక్యూటీ, అబుదాబీ ఇన్వెస్ట్‌మెంట్ అథారిటీ (ఏడీఐఏ) కన్సార్షియం కూడా పోటీ పడినప్పటికీ అధిక ధరకు బిడ్డింగ్ వేయడం ద్వారా మ్యాన్‌కైండ్ ఈ సంస్థను హస్తగతం చేసుకుంది. బీఎస్‌వీ కొనుగోలు మ్యాన్‌కైండ్ వ్యాపారాన్ని మరింత ఎత్తుకు తీసుకెళ్లనుంది. మహిళల ఆరోగ్యం, సంతాన సాఫల్య ఔషధాల మార్కెట్లో అగ్రగామిగా నిలపనుంది. అలాగే, క్రిటికల్ కేర్‌లో ఇతర ఉత్పత్తుల్లోకీ ప్రవేశం కల్పించనుంది. బయోఫార్మాస్యూటికల్స్‌లో ఐదు దశాబ్దాలకు పైగా అనుభవం కలిగిన బీఎస్‌వీ.. మహిళ ఆర్యోగానికి సంబంధించి సంతాన సాఫల్యం నుంచి ప్రసవం తర్వాత సంరక్షణలో ఉపయోగించే పలు సంక్లిష్ట ఉత్పత్తులను మార్కెట్లో విక్రయిస్తోంది. "మ్యాన్‌కైండ్ ప్రయాణంలో బీఎస్‌వీ కొనుగోలు కీలక మైలురాయి. మహిళల ఆరోగ్యం, ఫెర్టిలిటీ మార్కెట్లో తమను అగ్రసంస్థగా నిలబెడుతుంది. భవిష్యత్‌లో ఈ విభాగం అపార అవకాశాలు అందించడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా బలమైన వ్యాపార వృద్ధికి బాటలు వేయనుందని భావిస్తున్నా"మని మ్యాన్‌కైండ్ ఫార్మా వైస్ ఛైర్మన్, ఎండీ రాజీవ్ జునేజా అన్నారు.

పిట్టీ ఇంజనీరింగ్ చేతికి దక్షిణ్ ఫౌండ్రీ

డీల్ విలువ రూ.153 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): దక్షిణ్ ఫౌండ్రీ ప్రైవేట్ లిమిటెడ్ (డీఎఫ్‌పీఎల్)లో 100 శాతం వాటాలను రూ.153.12 కోట్లకు కొనుగోలు చేసినట్లు పిట్టీ ఇంజనీరింగ్ లిమిటెడ్ వెల్లడించింది. డీఎఫ్‌పీఎల్‌తో ఒప్పందం కుదుర్చుకున్న పదిహేను రోజుల్లో ఈ డీల్‌ను పూర్తి చేయనున్నట్లు పేర్కొంది. జూన్ త్రైమాసికం ముగిసే నాటికి డీఎఫ్‌పీఎల్ వద్ద రూ.42.71 కోట్ల నగదు, బ్యాంక్ బ్యాలెన్స్ ఉంది. డక్టైల్ ఐరన్, గ్రే ఐరన్, లో కార్బన్ అల్లాయ్ స్టీల్ గ్రేడ్స్, సిమో ఐరన్ కాస్టింగ్స్ తయారీలో డీఎఫ్‌పీఎల్ కీలకంగా ఉంది. బెంగళూరు, హోస్కోట్‌లో ఏటా 4,200 టన్నుల స్థాపిత సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లను నిర్వహిస్తోంది. డీఎఫ్‌పీఎల్ కొనుగోలుతో పిట్టీ ఇంజనీరింగ్ ఉత్పత్తి సామర్థ్యపరంగా మరింత బలోపేతం కానుందని సంస్థ ఎండీ అక్షయ్ ఎస్ పిట్టీ తెలిపారు.

స్థిరాస్తుల అమ్మకాల లాభాలపై కొత్త కొర్రీ

- వడ్డీ, స్టాంప్ డ్యూటీలు ఖర్చులు యథాతథం

న్యూఢిల్లీ: స్థిరాస్తుల అమ్మకాలపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీటీ) తగ్గించామని చెబుతూనే.. ప్రభుత్వం పెద్ద బాంబు పేల్చింది. ఈ లాభాల లెక్కింపు కోసం ఆస్తుల కనీస విలువను లెక్కించేటప్పుడు, వాటిని కొనేటప్పుడు చెల్లించే స్టాంప్ డ్యూటీ, అప్పు చేసి కొంటే.. ఆ అప్పులపై చెల్లించే వడ్డీల భారం.. ప్రస్తుతం ఉన్న విధంగానే లెక్కింపులోకి రాదని స్పష్టం చేసింది. కేంద్ర రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా గురువారం ఈ విషయం వెల్లడించారు. కొత్త ఎల్‌టీసీజీటీ విధానంలోనూ ఇదే పద్ధతి కొనసాగుతుందన్నారు. దీంతో ద్రవ్యోల్బణం ఆధారంగా లెక్కించే ఇండెక్సేషన్ ఖర్చుల ప్రయోజనం రద్దయి, స్థిరాస్తుల దీర్ఘకాలిక మూలధన లాభాలపై పన్ను భారం 20 శాతం నుంచి 12.5 శాతానికి తగ్గినా అమ్మకందారులకు పెద్దగా ప్రయోజనం లేదని భావిస్తున్నారు.

కెనరా బ్యాంక్ లాభం రూ.3,905 కోట్లు



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ ముగిసిన త్రైమాసికంలో రూ.3,905 కోట్ల నికర లాభం ఆర్జించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.3,535 కోట్లతో పోల్చితే లాభం 10 శాతం పెరిగింది. మొండి బకాయిలు తగ్గడం ఇందుకు దోహదపడింది. కాగా బ్యాంక్ త్రైమాసికాదాయం రూ.29,823 కోట్ల నుంచి రూ.34,020 కోట్లకు పెరిగింది. వడ్డీల ద్వారా జూన్ త్రైమాసికంలో రూ.28,701 కోట్లు ఆదాయం లభించింది. నికర వడ్డీ ఆదాయం 6 శాతం వృద్ధితో రూ.8,666 కోట్ల నుంచి రూ.9,166 కోట్లకు చేరింది. నికర వడ్డీ మార్జిన్ మాత్రం 3.05 శాతం నుంచి 2.90 శాతానికి తగ్గింది. భవిష్యత్తులో ఎన్ఐఎం మెరుగుపడి 2.95 శాతం వద్ద స్థిరపడుతుందని భావిస్తున్నట్టు బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈఓ కె.సత్యనారాయణ రాజు చెప్పారు. ఆస్తుల నాణ్యత విషయానికి వస్తే బ్యాంక్ స్థూల మొండి బకాయిలు (ఎన్‌పీఏ) గత ఏడాది ఇదే త్రైమాసికంతో పోల్చితే 5.15 శాతం నుంచి 4.14 శాతానికి తగ్గాయి. నికర ఎన్‌పీఏలు కూడా 1.57 శాతం నుంచి 1.24 శాతానికి తగ్గాయి. ఎన్‌పీఏలకు కేటాయింపులు రూ.2,418 కోట్ల నుంచి రూ.2,171 కోట్లకు తగ్గాయి. బ్యాంక్ సీఆర్ఏఆర్ (క్యాపిటల్ అడిక్వసీ నిష్పత్తి) 16.28 శాతానికి పెరిగింది. ప్రొవిజన్ కవరేజి నిష్పత్తి (పీసీఆర్) 118 బేసిస్ పాయింట్లు పెరిగి 89.22 శాతానికి చేరింది. ఈ ఏడాది చివరికి పీసీఆర్ 90 శాతం దాటాలని బ్యాంక్ భావిస్తున్నదని రాజు చెప్పారు. ప్రతి త్రైమాసికంలోనూ రూ.1,000 కోట్లు మొండి బకాయిలు వసూలు చేయాలన్నది తమ లక్ష్యమన్నారు.

రూ.8,500 కోట్ల సమీకరణ

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మొత్తం రూ.8,500 కోట్ల నిధులు సమీకరించేందుకు బ్యాంక్ డైరెక్టర్ల బోర్డు అనుమతించిందని ఎండీ తెలిపారు. టియర్ 1, టియర్ 2 బాండ్ల ద్వారా ఈ నిధులు సమీకరిస్తామన్నారు. అలాగే తమ అనుబంధ సంస్థలు కెనరా హెచ్ఎస్‌బీసీ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ, కెనరా రొబెకో ఏఎంసీ రెండింటిలోనూ 25 శాతం వంతున వాటాలు విక్రయించాలని నిర్ణయించినట్టు రాజు వెల్లడించారు.

పార్టీని మరింత బలోపేతం చేయాలి

- ఢిల్లీలో కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసిన బీజేపీ నాయకులు

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్), జూలై 25 : పాలమూరు జిల్లాలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేయాలని కేంద్ర వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, రసాయన, ఎరువుల శాఖ మంత్రి జేపీ నడ్డా సూచించారు. పార్లమెంట్ ప్రాంగణంలో శుక్రవారం పాలమూరు నియోజకవర్గ ఎంపీ డీకే అరుణ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా నాయకులు కొత్తకోట కిరణ్‌కుమార్‌రెడ్డి, బొక్క బాల్‌రెడ్డి, నవీన్ రెడ్డిలు జేపీ నడ్డాను కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఎంపీ అరుణ పాలమూరు జిల్లాలో ఎల్లవేళలా కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉంటారని అన్నారని అభిప్రాయపడ్డారు. ఉమ్మడి జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు.



ఎంపీ డీకే అరుణ ద్వారా కేంద్ర మంత్రి జేపీ నడ్డాను కలిసిన బీజేపీ నాయకులు

అప్రమత్తతతోనే సైబర్ నేరాల కట్టడి

- గుర్తు తెలియని వ్యక్తులతో ఆర్థిక వ్యవహారాలు షేర్ చేసుకోవద్దు : ఎస్పీ

మహబూబ్‌నగర్, జూలై 25 : టెక్నాలజీని ఉపయోగించుకుని నేరస్థులు ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్నారని ఎస్పీ జానకి విచారం వెలిబుచ్చారు. రోజురోజుకు సైబర్ నేరాలు పెరుగుతుండటం ఆందోళనకు గురి చేస్తున్నాయన్నారు. జిల్లా ప్రజలు వీటి విషయంలో జాగ్రత్తగా ఉండాలని ఆమె విజ్ఞప్తి చేస్తూ ప్రకటన విడుదల చేశారు. ప్రజల ఆర్థిక అవసరాలు, సులభంగా డబ్బు సంపాదించాలన్న దురాశతో వారి మోసాలకు బలైపోతున్నారన్నారు. ఇలాంటి నేరాలు కట్టడి చేయాలంటే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులతో ఫోన్‌లో మాట్లాడటం, వాట్సప్, ఫేస్‌బుక్ చాటింగ్ చేయడం ఆర్థిక విషయాలు షేర్ చేసుకోవడం వంటివి చేయవద్దన్నారు. ఓటీపీలు వస్తే ఎవరికీ చెప్పవద్దన్నారు. లాటరీలు, బ్యాంక్‌ల రివార్డ్‌లు, ఉద్యోగాలిస్తామని ఆశపెట్టడం, కమీషన్లు, డిస్కౌంట్‌ల పేరుతో సులభంగా డబ్బు సంపాదించుకోవచ్చని ఆశచూపి మోసం చేస్తున్నారన్నారు. బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, ఆధార్ నెంబర్ చెప్పాలని, మీ ఏటీఎం పనిచేయడం లేదని, కారు గెలుచుకున్నారని, మనీ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో, క్రెడిట్‌కార్డు లిమిటెడ్ పెంచుతామని ఇలా రకరకాలుగా సైబర్ నేరగాళ్లు ప్రజలను మోసగిస్తూ డబ్బులు కాజేస్తున్నారని పేర్కొన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోయిన బాధితులు వెంటనే 1930 టోల్‌ఫ్రీ నెంబర్‌కు గోల్డెన్ అవర్ (గంట)లో కాల్ చేసి వివరాలు తెలియజేస్తే డబ్బు తిరిగి వచ్చే అవకాశం ఉందన్నారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి

- పంచాయతీ రాజ్ ఈఈ నరేందర్‌రెడ్డి

కోయిలకొండ, జూలై 25 : మండల కేంద్రంలోని శ్రీ ఆది ఆంజనేయస్వామి దేవాయంలో నిర్మిస్తున్న కమ్యూనిటీ భవనం పనులు సకాలంలో పూర్తి చేయాలని పంచాయతీరాజ్ ఈఈ నరేందర్‌రెడ్డి సూచించారు. గురువారం ఆంజనేయస్వామి దేవాలయంలో రెండవ స్లాబ్ పనులను పరిశీలించారు. నిబంధనల ప్రకారం స్లాబ్‌కు మెటీరియల్ పెట్టాలని సూచించారు. పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. మండలంలో జరుగుతున్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు విజయభాస్కర్‌రెడ్డి, డిప్యూటీ ఈఈ సురేందర్‌రెడ్డి, సూపర్‌వైజర్ నవాజ్ పాల్గొన్నారు.

భూత్పూర్ మునిసిపాలిటీలో మొక్కల పంపిణీ

భూత్పూర్, జూలై 25 : మునిసిపాలిటీలోని నాలుగవ వార్డులో స్థానిక యువకుడు గడ్డం యాదయ్య వనమహోత్సవంలో భాగంగా గురువారం ఇంటింటికీ పండ్లు, పూల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన గృహిణిలతో, స్థానికులతో ఆయన మాట్లాడారు. మొక్కలు నాటడం గొప్పకాదని, నాటిన ప్రతీ మొక్కను బతికించుకోవాలని సూచించారు. గతేడాది నాటిన పండ్ల మొక్కలు చాలా ఇళ్లల్లో పండ్లు తినడానికి వచ్చాయని అన్నారు. ప్రతీ ఒక్కరు ఇంటి ఆవరణల్లో పండ్లు, పూల, ఔషధ మొక్కలను పెంచాలని అన్నారు. కార్యక్రమంలో స్థానికులు, యువకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి

చిన్నచింతకుంట, జూలై 25 : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ మండల కార్యవర్గ సమావేశం ఆ పార్టీ మండల అధ్యక్షుడు దశరథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సమావేశాన్ని ప్రారంభించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరించిన విధానాలనే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్నదని పేర్కొన్నారు. ఆచరణ సాధ్యంకానీ హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇప్పటికే వాటిని అమలు చేయక చేతులెత్తేసిందని తెలిపారు.



మాట్లాడుతున్న పద్మజారెడ్డి

'బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలి'

చిన్నచింతకుంట, జూలై 25 : బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని బీజేపీ ఓబీసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కుర్వ రమేష్, గుబ్బ శ్రీనివాసులు, జడలయ్య, నరిసింహులు, బాలస్వామి, ఎర్ర వెంకటన్న, బాలచందర్, సతీష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యంకు ఘన నివాళి



జడ్చర్లలో ఎర్రసత్యం చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న ముదిరాజ్ సంఘం నాయకులు

జడ్చర్ల, జూలై 25 : జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే మరాఠి సత్యనారాయణ (ఎర్రసత్యం) 67వ జయంతి కార్యక్రమాన్ని ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద గురువారం ఎర్రసత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రేణుక, పిట్టల మురళీ, చీకూరి శివ, వీడియో శ్రీను, శాంతయ్య, నర్సింములు, చంద్రమౌళి, బాలు, లక్ష్మమ్మ, మురళీకృష్ణ, అనంతకిశోర్, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే పట్టణంలోని బీసీ సేన కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బీసీ సేన రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయాదవ్, నిరంజన్, నర్సింములు, గోపాల్, శ్రీనివాస్, లింగంపేట శేఖర్, ప్రతాప్‌రెడ్డి, భీంరాజ్, నాగయ్య, వెంక టేశ్, రాములు, నరేందర్ పాల్గొన్నారు. జడ్చర్ల పట్టణంలోని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్ర శేఖర్ ఇంటి వద్ద ఎర్రసత్యం జయంతిని ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. ఎర్రసత్యం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో కృష్ణమోహన్, పర్శవేది, మురళీ, రమేశ్, యూనస్, శ్రీధర్ ఉన్నారు.

మహబూబ్‌నగర్‌లో...

మహబూబ్‌నగర్ టౌన్ : జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రసత్యం జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మహబూబ్‌నగర్‌లోని జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ స్వగృహంలో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళ్లర్పించారు. పేదల కోసం అనునిత్యం తపించిన నాయకుడని ఎర్ర శేఖర్ కొనియాడారు.

హిమోఫిలియా బాధితులకు మెరుగైన వైద్యం

- జనరల్ ఆసుపత్రి జనరల్ మెడిసిన్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నజ్మా

మహబూబ్‌నగర్ (వైద్యవిభాగం), జూలై 25 : ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో హిమోఫిలియా బాధితులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందిస్తామని జనరల్ మెడిసిన్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ నజ్మా అన్నారు. గురువారం హిమోఫిలియా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బాధితులకు ఉచితంగా ఇంజక్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. హిమోఫిలియా వ్యాధి బాధితులకు తమ ఆసుపత్రిలో అన్ని రకాల వైద్యసేవలు అందిస్తున్నామని, వారికోసం ప్రత్యేకంగా విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. హిమోఫిలియా బాధితులు శరీరంలో అంతర్గత రక్తస్రావం అయిన వెంటనే ఆసుపత్రికి రావాలని, వైద్యుల సూచనలు, సలహాలను ఖచ్చితంగా పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి ఆర్ఎంవో డాక్టర్ గణేష్, చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ నాగేష్, డాక్టర్ శ్రీపాల్, హిమోఫిలియా సొసైటీ హైదరాబాద్ బ్రాంచి ఉపాధ్యక్షుడు అబ్దుల్ రజాక్, జిల్లా సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు శివకుమార్, సతీష్‌కుమార్, ఇంటాస్ ఫౌండేషన్ ప్రాజెక్టు అసోసియేట్ కరుణాకర్, కౌన్సిలర్ సుజాత పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టపడి చదవాలి

- అప్పుడే ఆసక్తి ఉన్న రంగంలో స్థిరపడతారు

- వడ్డెమాన్ జడ్పీ ఉన్నత పాఠశాలను పరిశీలించిన కలెక్టర్

చిన్నచింతకుంట, జూలై 25 : విద్యార్థులు కష్టపడి చదివితేనే ఆసక్తి ఉన్న రంగంలో స్థిరపడేందుకు అవకాశం ఉంటుందని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం మండలంలోని వడ్డెమాన్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించారు. పాఠశాలలో అడ్మిషన్‌ల గురించి అడిగి తెలుసుకుని, విద్యార్థులతో మాట్లాడారు. వందశాతం ఫలితాలు సాధించాలని, కష్టపడి ఎంతో శ్రద్ధ, ఏకాగ్రతతో చదివితేనే మంచి ఫలితాలు వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు బలవర్ధకమైన ఆహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటారని సూచించారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం దమగ్నాపూర్ గ్రామ శివారులోని మండల సమీకృత గురుకుల పాఠశాల భవన సముదాయం కోసం అధికారులు, మాజీ సర్పంచ్ హన్మంతురెడ్డితో కలిసి కలెక్టర్ స్థలం పరిశీలించారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. గ్రామ సంఘాలు ఏ విధంగా పని చేస్తున్నాయి, చిన్న సంఘాల నిర్వహణ ఎలా ఉంది అని తెలుసుకున్నారు. పరిశుభ్రత, ఆరోగ్యంపై మహిళలు అవగాహన కలిగి ఉండాలని, విద్యావ్యవస్థ బలోపేతం విషయంలో మహిళలు దృష్టి సారించాలని తెలిపారు. సామాజిక అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కృష్ణయ్య, ఎంపీడీవో సుధాకర్, ఏపీఎం నవీన్, డీపీఎంలు నాగమల్లి పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం పరిశీలించిన కలెక్టర్

దేవరకద్ర : మండల కేంద్రంలో వంద పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల భవనాలు నిర్మించడానికి గురువారం కలెక్టర్ విజయేందిర బోయి స్థలాన్ని పరిశీలించారు. మండలంలోని పెద్ద చెరువు, బల్సుపల్లి తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాన్ని స్థానిక అధికారులతో కలిసి ఆమె పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో పెద్ద చెరువు దగ్గర ఉన్న ప్రభుత్వ స్థలంలో పల్లె ప్రకృతి వనం ఉందని, వాటి పక్కన ఉన్న స్థలంలో నూతనంగా వంద పడకల ఆసుపత్రి, డిగ్రీ కళాశాల నిర్మాణానికి స్థలం పరిశీలిచారు. ఆ స్థలం వివరాలను కలెక్టర్‌కు తహసీల్దార్ వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఆర్ఐ శరత్ తదితరులు పాల్గొన్నారు.



దేవరకద్రలో స్థలాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విజయేందిర

అభివృద్ధి పనులు వేగవంతంగా చేయించాలి

- అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్

మిడ్జిల్, జూలై 25 : మండలంలో అభివృద్ధి పనులను వేగంగా పూర్తయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్ అన్నారు. గురువారం మండలంలోని అయ్యవారిపల్లి, మిడ్జిల్, చౌటకుంటతండా, మంగళిగడ్డ తండా, తుల్జానాయక్‌తండాలను ఆకస్మికంగా పరిశీలించారు. అయ్యవారిపల్లి గ్రామంలో వనమహోత్సవంలో భాగంగా ఆయన మొక్కలను నాటారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలకు వెళ్లి విద్యార్థులను పాఠ్యాంశాల గురించి అడగగా, సరైన సమాధానం చెప్పకపోవడంతో విస్మయం వ్యక్తం చేశారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని మరమ్మతు పనులను పరిశీలించి, లీకేజీలపై అసంతృప్తి వ్యక్తంచేసి పనులను వెంటనే పూర్తి చేయించాలని అక్కడే ఉన్న పీఆర్ఏఈ అశృత్‌రాయ్‌ని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలోని లేబర్ రూం, ల్యాబ్‌లతో పాటు పలు గదులను పరిశీలించారు. 15రోజుల్లో మళ్లీ వస్తానని, అప్పటివరకు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. చౌటకుంట, తుల్జానాయక్ తండాలలోని పాఠశాలల్లో జీరో ఎన్‌రోల్‌మెంట్ కావడంతో అక్కడ ఉన్న ప్రజలతో మాట్లాడారు. పాఠశాలకు విద్యార్థులను పంపించండి ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై తీసుకవచ్చేందుకు కృషి చేస్తామని వివరించారు. ఆయన వెంట ఎంపీడీవో గీతాంజలి, ఎంపీవో జగదీష్‌కుమార్, పీఆర్ ఏఈ అశృత్‌రాయ్, మాజీ ఎంపీటీసీ గౌస్, ఏపీవో రాజేష్‌కుమార్, ఏపీఎం రాందాస్, పంచాయతీ కార్యదర్శులు సాయన్న, భాగ్యలక్ష్మి, కేజీవీబీ అధ్యాపకులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు ఉన్నారు.



కేజీబీవీలో మురుగునీటి సమస్యపై మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్

బడ్జెటంతా డొల్ల

- తెలంగాణ చౌరస్తాలో బీజేపీ నాయకుల నిరసన

మహబూబ్ నగర్ (క్లాక్‌టవర్), జూలై 25 : కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌లో ఎనికలప్పుడు ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవేర్చే ఊసే కనబడటం లేదని భారతీయ జనతాపార్టీ జిల్లా కమిటీ నాయకులు విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌ను నిరసిస్తూ బీజేపీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నాయకులు నల్లబ్యాడ్జీలను ధరించి తెలంగాణ చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు రైతుబంధు, ఆసరా పెన్షనర్లకు రూ. నాలుగు వేలు మంజూరు విషయంపై ఆ బడ్జెట్‌లో వివరించలేదని పేర్కొన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్ట్‌లకు దేనికెంత బడ్జెట్ అన్నది స్పష్టత లేదని, రూ.31 వేల కోట్లు అవసరం కాగా, ఇప్పటివరకు రూ. ఆరు వేల కోట్లు మాత్రమే రుణ మాఫీ జరిగిందని వారు పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం రూ.26 వేల కోట్లు ఇచ్చినప్పటికీ ఆ విషయాన్ని వెల్లడించకుండా కేంద్ర ఏమీ ఇవ్వడం లేదని రాష్ట్ర ప్రభుత్వం అబద్ధాలు చెపుతోందని వారు మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు కృష్ణవర్ధన్‌రెడ్డి, శేరి పాండురంగారెడ్డి, నారాయణ యాదవ్, రమేష్, యాదగిరి, కాటం నాగరాజు, పాల్గొన్నారు.

పేరు గొప్ప ఊరు దిబ్బ అన్నట్లుగా...

మహబూబ్‌నగర్ (క్లాక్‌టవర్) : అసెంబ్లీలో శుక్రవారం ప్రవేశపెట్టిన బడ్జెట్ అంతా అంకెల గారడీగాఉందని బీజేపీ రాష్ట్ర కోశాధికారి బండారి శాంతకుమార్ విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బడ్జెట్లో ఉన్న సారాంశం 70 పేజీల పుస్తకంలో 70 అబద్ధాలు, చేతగానమ్మకు మాటలు ఎక్కువ అని భట్టి చెప్పిన మాటలు ఆయనకే వర్తించినట్లు కనపడిందని తెలిపారు. చెప్పుకోడానికి రూ. 2,91,159 కోట్లతో బడ్జెట్ అని, ఖర్చేమో రూ.2,20,000 వేల కోట్లని తెలిపారు. పెట్టుబడి వ్యయం కింద రూపాయలు 33 కోట్లు అంటే ఇది రాష్ట్ర అభివృద్ధికి తిరోగమనమయ్యే బడ్జెట్ అని రాష్ట్ర భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే బడ్జెట్ పేర్కొన్నారు. వడ్డీలేని పంటరుణాలకు నిధులేవన్నారు. గృహ నిర్మాణంలో మీరిచ్చిన వాగ్దానం ప్రకారం రూ.24 వేల కోట్లు అవసరం ఉందని, వాటికి నిధులెందుకు కేటాయించలేదని ఆయన ప్రశ్నించారు. సాగునీటికి రూ. 26 వేల కోట్లు అన్నారు, మరి పాలమూరు-రంగారెడ్డి, డిండి, కాళేశ్వరం ప్రాజెక్టులకు ఎంత ఇచ్చారని ప్రశ్నించారు.



రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బడ్జెట్‌పై తెలంగాణ చౌరస్తాలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

మిగిలిన ఖాళీల పదోన్నతికి సన్నాహాలు

- కసరత్తు చేస్తున్న విద్యాశాఖ అధికారులు

- జిల్లాలో 47 మంది టీచర్లకు కలగనున్న పదోన్నతి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 25 : ప్రభుత్వం చేపట్టిన ఉపాధ్యాయ పదోన్నతుల అనంతరం మిగిలి ఉన్న లెఫ్ట్ ఓవర్ వెకెన్సీలను భర్తీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు జిల్లాలో ఖాళీగా ఉన్న 47 పోస్టుల భర్తీకి జిల్లా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. గురువారం విద్యాశాఖ కార్యాలయం ఏడీ ఆధ్వర్యంలో సూపరింటెండెంట్ తదితరులు జిల్లాలో ఎన్ని ఖాళీలు ఉన్నాయి, ఏఏ సబ్జెక్టులలో ఖాళీలు ఉన్నాయే గుర్తించారు. వివరాలను సబ్జెక్టుల వారీగా గుర్తించారు. ఖాళీలకు సంబంధించిన ఫైల్ పాఠశాల విద్యాశాఖ కార్యాలయానికి పంపిస్తారు. అక్కడి నుంచి నివేదిక రాగానే సీనియార్టీ మెరిట్, రోస్టర్ ఆధారంగా అర్హులైన ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పిస్తారు. దీంతో 47 మంది ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్ హోదా కలగనుంది.

పదోన్నతులు కలిగించేది ఈ సబ్జెక్టులోనే ..

సెకండరి గ్రేడ్ టీచర్స్ నుంచి స్కూల్ అసిస్టెంట్స్‌గా, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్స్‌గా 47 మంది పదోన్నతి పొందనున్నారు. జిల్లాలో గవర్నమెంట్ స్కూళ్లలో తెలుగు మీడియం స్కూల్ అసిస్టెంట్ తెలుగు -1, స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్రం-1, ఫిజికల్ డైరెక్టర్-1, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్-1, ఉర్దూ మీడియంలో స్కూల్ అసిస్టెంట్ ఉర్దూ-1, స్కూల్ అసిస్టెంట్ గణితం-1, లోకల్ బాడి (జిల్లా పరిషత్, మండల పరిషత్) పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు-1 , స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్-1, స్కూల్ అసిస్టెంట్ గణితం-2, స్కూల్ అసిస్టెంట్ భౌతికశాస్త్రం-7, స్కూల్ అసిస్టెంట్ జీవశాస్త్రం-2, స్కూల్ అసిస్టెంట్ సాంఘిక శాస్త్రం-09, పీడీ-03, ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్స్-10, స్పెషల్ ఎడ్యుకేషన్-2 పోస్టులున్నాయి.



జాబితాను పరిశీలిస్తున్న విద్యాశాఖ కార్యాలయం ఏడీ, సిబ్బంది

పాదచారులకు ఇబ్బందిగా మారిన పూలతొట్లు

-ఫుట్‌పాత్‌లను పరిశీలించిన మునిసిపల్ చైర్మన్, ట్రాఫిక్ పోలీసులు

మహబూబ్‌నగర్, జూలై 25 : పట్టణ ప్రధాన రహదారికి ఇరువైపులా పెద్ద సైజు పూలతొట్లను ఏర్పాటు చేయడం వల్ల పాదచారులు నడిచేందుకు ఇబ్బందిగా మారుతోంది. ఇదే విషయాన్ని ట్రాఫిక్ పోలీసులు మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకుపోగా గురువారం ప్రధాన రహదారిపై ఫుట్‌పాత్‌ను పరిశీలించారు. పెద్ద పూలతొట్లు ఫుట్‌పాత్‌ను ఆక్రమించడం వల్ల పాదచారులు ఫుట్‌పాత్‌పై కాకుండా రోడ్డుపై నడుస్తున్నారని, దీనివల్ల ప్రమాదాలతో పాటు ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయన్నారు. పూల తొట్లను సాధ్యమైన మేరకు వెనక్కి జరిపితే పాదచారులు ఫుట్‌పాత్‌ను వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. దీనిపై సానుకూలంగా స్పందించిన చైర్మన్, కమిషనర్‌లు సాధ్యమైన మేర చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ సుదర్శన్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ షంశొద్దీన్ పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు ఒక మొక్కనాటాలి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం : ప్రతీ ఒక్కరు తమ వంతుగా కనసం ఒక మొక్క నాటాలని మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్ అన్నారు. గురువారం మునిసిపల్ పరిధిలోని బోయపల్లి ఉన్నత పాఠశాలలో జీహెచ్ఎం కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ షబ్బీర్‌అహ్మద్, కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి, కౌన్సిలర్ మోతిలాల్, నర్సింములు, తిరుమల వెంకటేష్ తదితరలు పాల్గొన్నారు .



పూలతొట్లను పరిశీలిస్తున్న మునిసిపల్ చైర్మన్, పోలీసులు

బీజేవైఎం నాయకుల ముందస్తు అరెస్ట్

జడ్చర్ల, జూలై 25 : రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేయకపోతే అసెంబ్లీని ముట్టడిస్తామన్న పిలుపుమేరకు జడ్చర్లలో బీజేవైఎం నాయకులను ఎస్ఐ అశోక్‌బాబు ఆధ్వర్యంలో అరెస్ట్ చేశారు. అనంతరం వారిని సొంత పూచీకత్తుపై వదిలారు. నిరుద్యోగులకు అండగా ఉంటామన్నందుకు తమను అరెస్ట్‌లతో బెదిరించలేరని బీజేవైఎం పట్టణ అధ్యక్షుడు పిట్టల నరేశ్ అన్నారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లతో పాటు ఫీజు రీయంబర్స్‌మెంట్ నిధులు రూ.6500 కోట్లను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో బీజేవైఎం నాయకులు భరత్‌గౌడ్, సాయి ఉన్నారు.

పోలీసుల అదుపులో బీజేవైఎం నాయకులు

బాలానగర్ : బాలానగర్ మండలంలోనూ పోలీసులు బీజేవైఎం నాయకులు కుమార్‌నాయక్, రాజు, వేణు, తరుణ్, నందు, సాయికుమార్, వెంకటేష్ శ్రీకాంత్, తదితరులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సాయంత్రం వ్యక్తి గత పూచీకత్తుపై విడుదల చేశారు.



బాలానగర్ పోలీసుల అదుపులో బీజేవైఎం నాయకులు

ఓపెన్ పది, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 25 : ఎలాంటి అర్హత లేకున్నా తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియేట్ చదుకునేందుకు సెప్టెంబరు 10వ తేదీ లోపు దరఖాస్తులు చేసుకోవాలని డీఈవో రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు ఆన్‌లైన్, మీసేవ ద్వారాగాని అడ్మిషన్ ఫీజు చెల్లించవచ్చని తెలిపారు. ఎలాంటి అపరాధ రుసుం లేకుండా సెప్టెంబరు 10లోపు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

స్టేట్ హోమ్‌ను పరిశీలించిన న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి

మహబూబ్‌నగర్, జూలై 25 : స్టేట్‌హోమ్‌లో పిల్లలకు అందుతున్న వసతులు, భోజనం, వైద్యం, నీటి వసతి వంటి అంశాలపై జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఇందిర ఆరా తీశారు. గురువారం రాష్ట్ర న్యాయ సేవాధికారి సంస్థ ఆదేశాల మేరకు ఆమె పట్టణంలోని స్టేట్‌హోమ్, శిశుగృహ, చిల్డ్రన్ హోమ్‌లను పరిశీలించారు. అదేవిధంగా విద్యార్థులకు ఫోక్సోచట్టం, లీగల్ సర్వీసెస్ చట్టం, బాలల విద్య, బాల్య వివాహాల చట్టాలపై అవగాహన కల్పించారు.

మిడ్జిల్ ఎస్ఐగా శివనాగేశ్వర్ నాయుడు

మిడ్జిల్, జూలై 25 : మిడ్జిల్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా శివ నాగేశ్వర్ నాయుడు గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు ఇక్కడ ఎస్ఐగా విధులు నిర్వహించిన జయప్రసాద్‌ను నాగర్‌కర్నూల్ జిల్లా డీఎస్‌బీకి బదిలీ కాగా, భూత్పురు ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న శివనాగేశ్వర్‌నాయుడిని ఇక్కడికి వచ్చారు. పలువురు నాయకులు శాలువాలతో సన్మానించారు.

కోయిలకొండ తహసీల్దార్ బదిలీ

కోయిలకొండ, జూలై 25 : కోయిలకొండ తహసీల్దార్ భరత్ గౌడ్ వికారాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మండలం నుంచి రిలీవ్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌గా డిప్యూటీ తహసీల్దార్ మురళిని నియమిస్తూ జిల్లా రెవెన్యూ అధికారులు ఆదేశాలు ఇచ్చారు. నూతన తహసీల్దార్ వచ్చే వరకు మురళి ఇన్‌చార్జి తహసీల్దార్‌గా వ్యవహరించనున్నారు.

నేడు కోయిల్‌సాగర్ నుంచి నీటి విడుదల

దేవరకద్ర, జూలై 25 : మండలంలోని కోయిల్‌సాగర్ ప్రాజెక్టు నుంచి ఆయకట్టుకు నీటిని నేడు విడుదల చేస్తున్నట్లు ప్రాజెక్టు ఈఈ ప్రతాప్‌సింగ్ తెలిపారు. కోయిల్‌సాగర్‌లో ప్రస్తుతం 17.6 అడుగుల వద్ద నీటినిల్వ ఉందని, ప్రాజెక్టు కింద ఉన్న కుడి, ఎడమ కాల్వ కింద రైతులు సాగు చేసుకున్న పంటలకు నీటిని విడుదల చేయనున్నట్లు ఆయన తెలిపారు. నీటి విడుదల కార్యక్రమాన్ని దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి వస్తున్నారని తెలిపారు.

రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో బీజేపీ ఎంపీలు విఫలం

- కాంగ్రెస్ నాయకుల ఆరోపణ

హన్వాడ, జూలై 25 : రాష్ట్రం నుంచి ఎనిమిది మంది బీజేపీ ఎంపీలు గెలిచిన రాష్ట్రానికి నిధులు తీసుకురావ డంలో విఫలం అయ్యారని కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు ఆరోపించారు. గురువారం హన్వాడలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణయ్య, నాయకులు వెంకటయ్య, లింగం నాయక్ మాట్లాడుతూ ఎంపీలుగా గెలిపిస్తే నిధులు తెస్తామని చెప్పి గెలిచాక నిధులు ఎందుకు తీసుకురాలేదని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా ఎంపీలు తెలంగాణకు నిధులు తెచ్చేందుకు కృషి చేయాలన్నారు. నాయకులు రాజు నాయక్, కృష్ణయ్య యాదవరెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ పరీక్షకు 60 మంది గైర్హాజరు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం జూలై 25 : డీఎస్సీ ఆన్‌లైన్ పరీక్ష ప్రశాంతంగా కొనసాగుతోంది. గురువారం జిల్లా కేంద్రం సమీపంలోని ధర్మాపూర్‌లో గల జేపీఎన్‌సీఈ కళాశాల, క్రిస్టియన్ పల్లిలోని ఫాతిమా విద్యాలయంలో పరీక్ష కేంద్రాలు కొనసాగుతున్నాయి. జేపీఎన్‌సీఈ కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 180 మంది అభ్యర్థులు హాజరుకావాల్సి ఉండగా 160 మంది హాజరు కాగా 20 మంది హాజరుకాలేదు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 180 మంది అభ్యర్థులకుగాను 165 మంది హాజరు కాగా, 15 మంది హాజరు కాలేదు. ఫాతిమా విద్యాలయంలోని పరీక్ష కేంద్రంలో ఉదయం నిర్వహించిన పరీక్షకు 184 మందికిగాను 175 మంది హాజరుకాగా, 9 మంది హాజరుకాలేదు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 184 మందికి గాను 165మంది హాజరుకాగా 16 మంది హాజరుకాలేదు. మొత్తంగా 60 మంది అభ్యర్థులు గైర్హాజరయ్యారు.

'టీచర్ల సర్వీస్ నష్టపోకుండా చూడాలి'

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 25 : మ్యూచువల్ దిలీలలో బదిలీ అయిన ఉపాధ్యాయులు సర్వీస్ నష్టపోకుండా చూడాలని జీవో 317 పరస్పర బదిలీల ఫోరం ఉపాధ్యాయ సంఘం నాయకులు అంజిరెడ్డి ఒక ప్రకటనలో కోరారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 317తో చాలా మంది ఉపాధ్యాయులు స్థానికత వదులుకోవాల్సి వచ్చిందని, ఆ జీవో వల్ల సుదూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చిందని అన్నారు. స్పౌజ్, మెడికల్, అవివాహిత ఉపాధ్యాయులు, చిన్నపిల్లలు కలిగిన తల్లులు వివిధ రకాల వ్యాధులు ఉన్న వారు కుటుంబాలకు దూరంగా వెళ్లారని, వారంతా తర్వాత పరస్పర బదిలీలు పొంది 20 నుంచి 25 ఏళ్ల సర్వీస్ పోగొట్టుకొని జూనియర్‌లుగా మారారని, వారికి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. సర్వీస్ నష్టపోకుండా చూడాలన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 25 : క్రీడాభివృద్ధికి 2024-25 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్‌లో రాష్ట్ర ప్రభుత్వం రూ.325 కోట్లు కేటాయిండంపై గురువారం జిల్లా కేంద్రంలో స్టేడియం మైదానంలో క్రీడా సంఘాల ఆధ్వర్యంలో సీఎం రేంవత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర క్రీడ సలహాదారులు జితేందర్‌రెడ్డి సలహాలు, సూచనలతో క్రీడా రంగానికి బడ్జెట్‌లో పెద్ద ఎత్తున కేటాయించారని క్రీడా సంఘాల ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘం కార్యదర్శి కురుమూర్తి, వివిధ క్రీడా సంఘాల ప్రతినిధులు ముత్యం, దామోదర్‌రెడ్డి, బాలరాజు, జియావుద్దీన్, శ్రీనివాసులు, ఆసిఫ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

బడ్జెట్ కేటాయింపుపై కృతజ్ఞతలు

మహబూబ్‌నగర్ అర్బన్, జూలై 25 : మైనార్టీల సంక్షేమానికి బడ్జెట్‌లో రూ. 3003 కోట్లు కేటాయించడం పట్ల అల్‌మేవా రాష్ట్ర అధ్యక్షుడు షేక్ ఫారుక్ హుస్సేన్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నిధులు కేటాయించడం పట్ల కృతజ్ఞతలు తెలిపారు. పదేళ్ల పాలనలో మైనార్టీలను పట్టించుకోలేదని, కాంగ్రెస్ సర్కార్ బడ్జెట్ కేటాయించి చరిత్ర సృష్టించిందని పేర్కొన్నారు.

పాఠశాలను తనిఖీ చేసిన ఏంఎవో

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 25 : జిల్లా కేంద్రంలోని శివశక్తి నగర్ ప్రభుత్వ పాథమిక పాఠశాలను గురువారం ఏంఎవో దుకుండు శ్రీనివాస్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచిం చారు. ప్రభుత్వం అందిస్తున్న ఉచిత దుస్తులు, పాఠ్యపుస్తకాలు అందాయా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతోందని ఉపాధ్యాయుల ఏంఎవో దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.